గర్భిణులను అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరీక్షలకు ఆర్ఎంపీలు రిఫర్ చేయొద్దు

» డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని

ఏలూరు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులను అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలకు ఆర్ఎంపీలు రిఫర్ చేయరాదని డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనను ఆమె విడుదల చేశారు. గర్భిణులు అర్హులైన వైద్యులను మాత్రమే సంప్రదించాలని, నాటువైద్యులను లేదా ఆర్ఎంపీలను ఆశ్రయించవద్దని సూచించారు. గర్భిణిగా తొమ్మిది నెలల్లో రెండు దఫాలు మాత్రమే స్కానింగ్ చేయించుకోవచ్చని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రభుత్వ పరిధిలో 13, ప్రైవేటు పరిధిలో 102 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయన్నారు. లింగ నిర్ధారణ గురించి తెలిపితే సంబంధిత యాజమాన్యాలకు జైలుశిక్ష, జరిమానా విధిస్తామని హెచ్చరించారు. లింగనిర్ధారణకు సంబంధించి ఆసుపత్రులు అతిక్రమణలకు పాల్పడితే టోల్ ఫ్రీ నంబరు 1800 4256 131కు ఫిర్యాదు చేయాలని కోరారు.

వేసవిలో 44 ప్రత్యేక రైళ్లు

■ లోపలి పేజీలో..



ఇది తాడేపల్లిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్. ఇలా గోడలన్నీ పెచ్చులూడి ఎప్పుడు కూలిపోతుందోనన్నట్టుగా ఉంది.



కలిదిండిలో శిథిలావస్థలోని బీసీ బాలిక వసతి గృహం

వసతి లేని గృహాలు

ఆంధ్రజ్యోతి విజిట్

పెచ్చులూడిన శ్లాబ్‌లు, బీటలు తీసిన గోడలు, ఎప్పుడు కూలతాయో తెలియని భవనాలు.. అరకొర వసతులు.. అధ్వానంగా ఉన్న పరిసరాలు.. అక్కడ ఉండే విద్యార్థుల భద్రతకు భరోసా లేని పరిస్థితులు.. ఇది ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పలు సంక్షేమ వసతి గృహాల దుస్థితి. ఏటా బడ్జెట్‌లో రూ.కోట్లు వెచ్చిస్తున్నా వసతి గృహాల ముఖచిత్రం మారడం లేదు. హాస్టల్స్ తీరుతెన్నులు ఎలా ఉంది, ఏ ఏ సమస్యలు తిష్ఠ వేసి ఉన్నాయో 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో వెలుగు చూశాయి.

■ లోపలి పేజీలో..

సర్దుకుపోండి

- అది పశ్చిమలోని ఆర్థికంగా సంపన్నమైన మున్సిపాలిటీ. అక్కడ అధికారులకు, ఎమ్మెల్యేలకు పొసగడం లేదు. గతంలో రాష్ట్రస్థాయి నేత సిఫారసు చేశారని మున్సిపల్ ముఖ్య అధికారిని రప్పించుకున్నారు. వచ్చిన తర్వాత సిబ్బందితో సఖ్యత కుదరలేదు. ఇది పట్టణాభివృద్ధిపై ప్రభావం పడింది. మరోవైపు నిర్మాణ రంగానికి ఊత మిచ్చే పట్టణ ప్రణాళికలోనూ అధికారుల తీరు సరిగా లేదు. దీంతో ఇద్దరు అధికారులను బదిలీపై వెళ్లిపోవాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.
- వాణిజ్య కేంద్రమైన ఆ పట్టణంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత శాంతి భద్రతలకు విఘాతం కలిగింది. వరుస హత్యలు జరిగాయి. దర్యాప్తులో పోలీస్ వైఫల్యం కనిపించింది. సాయంత్రమైతే మహిళలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి. రాత్రి పూట పోలీస్ పర్యవేక్షణ లేదు. మరోవైపు కొందరు నాయకుల వసూళ్ల దందా మొదలైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ పోలీసు అధికారిని బదిలీపై వెళ్లిపోవాలని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో పనిచేసిన వారినే ఇప్పుడు ఉంచుకోవడం తప్పిదమైందన్న భావన కేడర్‌లో నెలకొంది.
- సాంస్కృతిక, కళా రంగాలకు పేరు పొందిన ఓ పట్టణంలోని పోలీస్ అధికారి తీరు అక్కడి ఉన్నత పదవిలో వున్న ప్రజా ప్రతినిధికి నచ్చలేదు. మద్యం కేసులో నిందితునిగా ఉన్న వైసీపీ నేత అరెస్ట్ విషయం లో పోలీసులు విఫలమయ్యారు. దీనిపై ఒత్తిడి పెంచినా ఫలితం లేక ఓ దశలో తన వద్ద ఉన్న సెక్యూరిటీని పంపించేశారు. ఆ ముఖ్య నేత అంతలా అసహనానికి గురయ్యారు. ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది.
- ఆ ప్రభుత్వ విద్యాలయం పరిశోధనలకు ప్రసిద్ధి. ఇటీవల పరిశోధనలు తగ్గుముఖం పట్టాయి. స్థానిక ప్రజా ప్రతినిధిని లెక్క చేయడం లేదు. దీనిపై కూటమి నేతలు ఆ శాఖ మంత్రికి ఫిర్యాదుచేశారు. తక్షణమే అధికారిని తొలగించాలంటూ పట్టుబట్టారు.

బదిలీల వేళ.. పశ్చిమలో అధికారులకు ప్రజాప్రతినిధుల సంకేతాలు



» బదిలీలకు అధికారులు, ఉద్యోగుల యత్నాలు
» సిఫారసు లేఖల కోసం ఎమ్మెల్యేల కార్యాలయాలకు ఉద్యోగుల క్యూ
» పనిమంతులైతేనే గ్రీన్‌సిగ్నల్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పలువురు ముఖ్య అధికారుల తీరుతో విసిగిపోతున్న ప్రజా ప్రతినిధులు వారిని సాగనంపేందుకు సిద్ధమయ్యారు. ఇప్పుడు బదిలీలకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో స్థానిక ప్రజా ప్రతినిధులతో సయోధ్య లేని వారంతా బదిలీపై వెళ్లిపోవడానికి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అటువంటి అధికారులను వదిలించుకోవడానికి ఎమ్మెల్యేలు సుముఖంగా ఉన్నారు. ఇతరుల సిఫారసుతో అంగీకరిస్తే తీరా విధి నిర్వహణలో వైఫల్యం చెందుతున్నారంటూ ఎమ్మెల్యేల్లో ఇప్పుడు ఒకింత అసంతృప్తి నెలకొంది. మరోవైపు డివిజన్ స్థాయి అధికారుల కోసం ఎమ్మెల్యేలు సిఫారసు లేఖలు ఇచ్చారు. వారిని కాదని ప్రభుత్వం వేరే వారిని నియమించింది. ఇది ఎమ్మెల్యేల్లో ఒకింత సెగరేపింది. అయితే వారి విషయంలో కొంత సర్దుకుపోతున్నారు. అయినా విధి నిర్వహణలో అలసత్వం, సిబ్బందితో సయోధ్య లేకపోవడం, ప్రజల్లో వ్యతిరేకత ఎదుర్కొంటున్న అధికారులను సాగనంపేందుకు ఎమ్మెల్యేలు సిద్ధమైపోయారు.

పనిమంతులకు ఆహ్వానం

విధి నిర్వహణలో పనిమంతులను ఏరికోరి తెచ్చుకోవడానికి ప్రజా ప్రతినిధులు ప్రయత్నిస్తున్నారు. జిల్లా స్థాయిలో కొన్ని అధికారిక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్‌ఛార్జ్ అధికారులతో పాలన నిర్వహిస్తున్నారు. జిల్లా కేడర్‌లో పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహించే అధికారులను రప్పించుకోవడానికి ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు సిఫారసు చేస్తున్నారు. గతంలో జిల్లా పంచాయతీ బాధ్యతలను నిర్వహించిన అధికారిని వేరే శాఖకు మళ్లీ రప్పించుకునేందుకు కూటమి నేతలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అటువంటి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంతకుముందు ఆర్డీవో స్థాయి అధికారు లను జిల్లా నాయకులు ఏరికోరి తెచ్చుకున్నారు. సమర్థవంతంగా పనిచేసే అధికారులను వదులుకోవడానికి ఇష్టం లేక ఇక్కడే ఉంచుకున్నారు.

ఎమ్మెల్యేల వద్దకు క్యూ

ప్రభుత్వం బదిలీలకు అవకాశం ఇవ్వడంతో ఎమ్మెల్యేల వద్ద సిఫారసు లేఖల కోసం ఉద్యోగులు క్యూ కడుతున్నారు. వివాదాలు లేని పట్టణాలు, నియోజకవర్గాలకు వెళ్లడానికి ఉద్యోగుల్లో పోటీ నెలకొంది. సదరు ఎమ్మెల్యేల లేఖల కోసం ఉద్యోగులు ఎగబడుతున్నారు. రెండు రోజుల నుంచి ఎమ్మెల్యే కార్యాలయాల వద్ద ఉద్యోగులతో రద్దీ నెలకొంది. బదిలీల విషయంలో ఓ ఎమ్మెల్యే సిఫారసు లేఖ ఇవ్వాలంటే ఆయన అనుచరులు ఉద్యోగుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో ఈసారి సదరు ఎమ్మెల్యే వద్దకు ఉద్యోగులు సిఫారసు లేఖ కోసం చాలా మంది వెనుకంజ వేస్తున్నారు. సదరు ఎమ్మెల్యే తీరుపైనా ప్రజల్లో కాస్త వ్యతిరేకత ఏర్పడింది. ఉద్యోగుల బదిలీల్లో పారదర్శకంగా ఉండే ఎమ్మెల్యేల కార్యాలయాల వద్ద ఉద్యోగులు సిఫారసు లేఖల కోసం ఎగబడుతున్నారు. వారు సానుకూలంగా స్పందిస్తున్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కొవిడ్ ప్రత్యేక పరీక్ష కేంద్రం

ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కొవిడ్ పరీక్షల ల్యాబ్ ఏర్పాటు

ఏలూరు అర్బన్, మే 23(ఆంధ్రజ్యోతి): కొవిడ్-19 అనుమానిత లక్షణాలతో వైద్యం కోసం వచ్చే రోగులకు వైరస్ టెస్టులు చేసేందుకు శుక్రవారం ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. ఆసుపత్రి జనరల్ మెడిసిన్, ఔట్ పేషెంట్ విభాగాలకు వచ్చే రోగుల్లో ఎవరికైనా అనుమానిత లక్షణాలుంటే వారినుంచి శ్వాబ్‌ను ర్యాపిడ్ కిట్లతో సేకరించి వైరస్ నిర్ధారణకు వీఆర్‌డీఎల్ పరీక్షను చేసేందుకు ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చారు. శుక్రవారం కొవిడ్-19 అనుమానిత లక్షణాలతో ఆసుపత్రికి ఎవరూ రాలేదని డీఎంహెచ్‌వో కార్యాలయ ఐడీఎస్‌పీ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ తెలిపారు.

హర్షిత జూనియర్ కళాశాలకు ప్రభుత్వ గుర్తింపు రద్దు

ఏలూరు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన కారణంగా కామవరపుకోట మండలం తడికలపూడిలోని హర్షిత ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహిస్తున్న హర్షిత జూనియర్ కళాశాలకు ప్రభుత్వ గుర్తింపును 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాల మేరకు రద్దు చేసినట్టు ఆర్ఐవో కె.యోహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు రద్దు నోటీసును శుక్రవారం కళాశాల సిబ్బందికి అందజేశామన్నారు. కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లను చేయరాదని, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు టీసీ తీసుకుని మరో కళాశాలలో చేరాలని సూచించారు.

సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

ఏలూరు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన ఫిజిక్సు పరీక్షకు జిల్లాలో 4,297 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,026 మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య ఇంటర్మీడియట్ మ్యాథ్స్ పరీక్షకు 75 మందికి 62 మంది, హిస్టరీ పరీక్షకు 62 మందికి 47 మంది, టెక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరీక్షకు 302 మందికి 259 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు.

ఈఏపీ సెట్‌కు 28 మంది గైర్హాజరు

ఏపీ ఈఏపీ సెట్‌లో భాగంగా శుక్రవారం జరిగిన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం షిఫ్టు పరీక్షలకు 161, 152 మంది, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రంలో 148, 143 మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 171, 174 మంది హాజరయ్యారు. మొత్తంమీద 28 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

నాటు తుపాకీ మందు పేలిన ఘటనలో ఒకరి మృతి

కైకలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): నాటు తుపాకీ మందు పేలి గాయపడిన ముగ్గురు యువకుల్లో ఒకరు మృతి చెందినట్టు కైకలూరు రూరల్ ఎస్ఐ రాంబాబు తెలిపారు. ఈనెల 13న కైకలూరు మండలం రామవరంలో పక్షుల వేటగాళ్లు నాటు తుపాకీ మందు కలుపుతుండగా పేలింది. మందు కలుపుతున్న ఇద్దరితో పాటు మరో యువకుడు తీవ్రంగా గాయపడడంతో ఏలూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వీరంతా తమిళనాడుకు చెందిన వాళ్లు కావడంతో కుటుంబసభ్యులు చెన్నైలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణగిరి జిల్లా పుత్తరాంగ్ మండలం ఉల్లగుట్టికి చెందిన మణిసతీష్ (36) మృతి చెందినట్లు తెలిపారు. మిగిలిన ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బియ్యం కార్డుల్లో మార్పులు, చేర్పులు నిరంతర ప్రక్రియ

» డీఎస్‌వో శివరామమూర్తి



ఏలూరు సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణతో పాటు ఏడు రకాల సేవలను పారదర్శకంగా పునఃప్రారంభించారని, ఇది నిరంతర ప్రక్రియని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శివరామమూర్తి తెలిపారు. పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త బియ్యం కార్డు అందించడం, కొత్త సభ్యుల పేర్లు చేర్చడం, సభ్యుల పేర్లు తొలగించడం, చిరునామా మార్పులు, తప్పుడు ఆధార్ నంబర్ సీడింగ్‌ను సరిచేసుకునే అవకాశం కలిగిందన్నారు. రైస్ కార్డు సేవలపై సందేహాలు ఉంటే 1800-425-6453 నంబర్‌తో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్ కు ఫోన్ చేసి తమ సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. జూన్ 1వ తేదీ నుంచి చౌక దుకాణాల వద్దే రేషన్ అందించేందు కు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 15 వతేదీ వరకు రేషన్ తీసుకోవచ్చన్నారు. షాపునకు వచ్చి రేషన్ తీసుకోని పరిస్థితు ల్లో ఉంటే 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటికే డీలర్ డోర్ డెలివరీ చేస్తారన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

జిల్లాలో ధాన్యం కొనుగోలు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు డీఎస్‌వో తెలిపారు. రబీలో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యానికి ఇంతవరకు 2.51 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. 20,416 మంది రైతుల వద్ద నుంచి రూ. 579 కోట్లు విలువైన ధాన్యం కొనుగోలు చేసి రూ.502 కోట్లు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. మిగిలిన రూ.72 కోట్లు సోమవారం లోపు ఖాతాలకు జమ అవుతాయన్నారు. ధాన్యం కొనుగోలులో ఏమైనా సమస్యలు ఉంటే 08812-230448, 7702003584 నంబర్లతో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి తెలపవచ్చన్నారు.





■ లోపలి పేజీలో..

రైతులకు అండగా

తాము రైతులకు అండగా ఉంటామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఏలూరులో కోకో రైతుల సమావేశంలో మంత్రులు అచ్చెన్న, పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యేలు బడేటి, కామినేని, చింతమనేని, బొలిశెట్టి తదితరులు

నరసాపురం మండలం సరిపల్లిలో డ్రెయిన్ తవ్వకం పనులకు మంత్రి నిమ్మల శంకుస్థాపన. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే బండారు, రామరాజు

ఇంకెన్ని ఇచ్చారో..?



అనర్హులకు దర్భరేవు కంపెనీ భూముల పట్టాలిచ్చి రిజిస్ట్రేషన్లు

వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు, సిబ్బంది నిర్వాకం
వెలుగులోకి మరిన్ని మోసాలు.. పట్టాల రద్దుకు సిఫారసు

(నరసాపురం-ఆంధ్రజ్యోతి):

దర్భరేవు కంపెనీ భూముల రిజిస్ట్రేషన్లలో చోటు చేసుకున్న అవినీతి భాగోతం ఒక్కొక్కటిగా వెలుగుచూసోంది. అనర్హులకు పట్టాలు ఇచ్చి వాటిని రిజిస్ట్రేషన్ చేయించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అవినీతి మాయాజాలం నేడు అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఒక్కొక్కటి వెలుగు చూస్తుంటే.. వాటిని ఏ విధంగా పరిష్కరించాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. విచారించి ఒక్కొక్క పట్టాను రద్దు చేస్తున్నారు. దర్భరేవు కంపెనీ భూముల రైతుల పోరాటం 30 ఏళ్లుగా సాగుతోంది. బ్రిటిష్ హయాంలో కొంతమంది రైతులు కంపెనీగా ఏర్పడి భూములను సాగు చేశారు. నరసాపురం నుంచి పంట కాల్వలను స్వయంగా తవ్వుకుని వేము లదీవి ఛానల్‌గా నామకరణం చేసుకున్నారు. వందేళ్ల నాటి చౌడు భూములను సస్య శ్యామలం చేశారు. అప్పటి నుంచి ఇవన్నీ దర్భరేవు కంపెనీ కిందే ఉన్నాయి. ఇలా నరసాపురం మండలంలో 1,750 ఎకరాలు ఉంది. ఈ భూముల్లో సుమారు 1,400 మందికిపైగా రైతులు ఉన్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వం మారడంతో ఈ ప్రక్రియ పెండింగ్‌లో పడింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం 2021లో కొత్త జీవోను విడుదల చేసి రైతులకు పట్టాలిస్తున్నట్టు ప్రకటించడంతో అవినీతికి తెరలేపారు. కొందరు అధికారులు, కంపెనీ సిబ్బంది కలిసి సాగు రైతులకు కాకుండా మరొకరికి పట్టాలిచ్చి వాటిని రిజిస్ట్రేషన్ చేశారు. వీటిపై అనేక ఆరోపణలు వచ్చినా వీటిని తొక్కిపెట్టారు.

ఒక్కొక్కటి వెలుగులోకి

ఈ ఏడాది పట్టణానికి చెందిన రఘువెంకట సత్యరఘునారాయణ తమ తండ్రి కందుల వెంకటకృష్ణరాజు పేరున ఆర్ఎస్ నెంబర్ 12/సిలో 40 సెంట్లు, ఆర్ఎస్ నెంబర్ 307/7న 1.60 సెంట్లు మొత్తం రెండు ఎకరాల భూమి వారసులమైన తమకు కాకుండా మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని ఫిబ్రవరిలో తహసీల్దార్ రాజరాజేశ్వరికి ఫిర్యాదుచేశారు. ఆమె వీఆర్వోతో విచారణ చేయించారు. చనిపోయిన రైతుకు నలుగురు కుమారులు ఉన్నారని, అయితే వారసులు లేరని చూపించి ఆమె కుమార్తె పేరున రిజిస్ట్రేషన్ చేయించారని వీఆర్వో మెహర్‌బాబా నివేదిక ఇచ్చారు. కంపెనీ ఉద్యోగి ప్రోద్బలంతో పాటు జరిగిందని తహసీల్దార్‌కు రిపోర్టు చేశారు. ఆమె మార్చి 31న పట్టాను రద్దు చేయాలని సబ్ రిజిస్ట్రర్‌కు లేఖ రాశారు. ఇది అమలు కాకపోవడంతో బాధితుడు ఆర్డీవో దాసి రాజుకు ఫిర్యాదుచేశారు. ఆయన విచారించి పట్టాను రద్దు చేయాలని సబ్ రిజిస్ట్రర్‌కు రాశారు. ఇలాంటి ఘటన మరొకటి. ఒడుగు గంగరాజు అనే రైతు ఇటీవల ఫిర్యాదు చేశాడు. దీనిపై అధికారులు విచారిస్తున్నారు.

● ఆ పట్టాను రద్దు చేయిస్తాం



దర్భరేవు భూముల రిజిస్ట్రేషన్‌లో అప్పటి అధికారులు వారసులకు కాకుండా మహేశ్వరికి పట్టా ఇచ్చారు. ఇప్పటికే విచారణ చేశాం. దీనిని రద్దు చేయాలని సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించాం. అయితే రిజిస్ట్రేషన్ జరిగి రెండేళ్లు గడిచింది. రద్దు చేసే అధికారం కలెక్టర్ ఉంది. దీన్ని రద్దు చేయాలని కలెక్టర్‌కు నివేదించాం.

\- దాసి రాజు, ఆర్డీవో

● మోసం బయటపడింది



చనిపోయిన మా నాన్న పేరునే కంపెనీ భూమి, షేర్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం వారసులైన మా నలుగురికి భూమి పట్టాలు ఇవ్వాలి. కాని, అధికారులు, కంపెనీ సిబ్బంది ప్రలోభాలకు లోనై మరొకరికి పట్టా ఇచ్చారు. దీనిపై ఫిర్యాదు చేశాం. ఇప్పటికి మా పేరున పట్టా రాలేదు. ఇచ్చిన పట్టాను రద్దు చేయడం లేదు.

\- సత్యరఘునారాయణ, రైతు

ఆంధ్రజ్యోతి విజిట్

సంక్షోభ హాస్టళ్లు



ఏలూరు అమీనాపేట బాలికల హాస్టల్‌లో ఊడిపోయిన కిటికీ తలుపులు

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు తిష్ఠ

చాలాచోట్ల అద్దె భవనాలే
ఇరుకు గదులు.. వసతుల లేమి
కొన్ని చోట్ల శిథిలావస్థలో..
నిర్వహణ లోపాలతో ఇక్కట్లు
ఈసారైనా పట్టించుకుంటారా ?
హాస్టళ్లను పరిశీలించిన ఆంధ్రజ్యోతి బృందం

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు సాధారణ విద్య దగ్గర నుంచి ఉన్నతవిద్య అందించి తీర్చాల్సిందే. మారుమూల ప్రాంతాల నుంచి నగర, పట్టణ, పేదలంతా వారి పిల్లలను చదివేందుకు వారికి అవసరమైన వసతి, సంక్షేమం, భద్రత కల్పిం చేందుకు ప్రభుత్వ హాస్టల్స్ ఏర్పాటు అసలు ఉద్దేశం. రాను రాను వసతిగృహాల్లో పరిస్థితి నానాటికీ తీసికట్టు అవుతోంది. ప్రతి ఏటా బడ్జెట్‌లో విద్యార్థుల సంక్షేమానికి కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా లక్షల్లో ఖర్చు అయ్యే వసతిగృహాల మరమ్మతులకు మాత్రం నిధులు చాలీ చాలనంతగా వుంటున్నాయి. అనేక హాస్టళ్లు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సాంఘిక సంక్షేమ శాఖతో పాటు బీసీ, ఎస్సీ విద్యార్థులకు కూడా హాస్టళ్లు ఉన్నాయి. ఏలూరు జిల్లా పరిధిలో ఒక సోషల్ వెల్ఫేర్ పరిధిలోనే 54 అతిథిగృహాలు ఉండగా వీటిలో 4,460 మంది విద్యార్థులకు ప్రతిఏటా వసతి కల్పిస్తున్నారు. పశ్చిమలో 35కి పైగానే హాస్టళ్లు ఉండగా వాటిలో 1,500 మందికి ఉంటున్నారు. బీసీ హాస్టల్స్ విషయానికి వస్తే ఏలూరులో 50, పశ్చిమలో 29 ఉన్నాయి. గత ఐదేళ్ల జగన్ జమానాలో సంక్షేమ హాస్టల్స్, గురుకుల హాస్టల్స్‌లో కూడా విద్యా ర్థులను దారిద్ర్యం వెంటాడింది. చలికాలంలో దుప్పట్లు కొరత, వేసవిలో ఉక్కపోత అన్ని చోట్ల సర్వసాధారణం అయింది. పేద విద్యార్థులుండే హాస్టల్స్‌కు జిల్లాస్థాయి ఉన్నతాధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు అన్ని ఉన్నట్లే చూపిస్తూ ఆ తరువాత పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారు. కొన్నిచోట్ల హాస్టళ్లకు భద్రత అంతంతమాత్రంగా ఉంది. ముఖ్యంగా బాలికల హాస్టల్స్‌లో కొన్నింటిలో బాత్ రూంల కొరత స్పష్టంగా ఉంది. ఇదే విషయాన్ని మీడియా బయట పెట్టినప్పుడు తూతూమంత్రంగా మరమ్మతుల చేయడం, ఆ తరువాత వదిలేయడం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితుల నుంచి శాశ్వత ప్రాతిపదికన బయట పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోలేకపోతుంది. మరి కొద్దిరోజుల్లోనే పాఠశాలు తెరుచుకో బోతున్నాయి. ఈలోపే అసలు హాస్టల్స్ పరిస్థితి ఏమిటి ? సదుపాయాలు ఎలా ఉన్నాయి..? అని ఆంధ్రజ్యోతి బృందం పరిశీలించింది.



నరసాపురంలో అద్దె భవనంలో ఉన్న బీసీ హాస్టల్

అరకొర వసతుల మధ్య..

నరసాపురం : నరసాపురం నియోజకవర్గంలో మొత్తం 14 సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో బీసీ ఎనిమిది, ఎస్సీ ఆరు హాస్టళ్లు ఉన్నాయి. కేవలం నాలుగు మాత్రమే సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగిలినవన్ని అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు. వీటిలో మూడు కాలేజీ హాస్టళ్లు కూడా ఉన్నాయి. గోదావరి ఏటిగట్టున ఉన్న బీసీ కాలేజీ హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు కూడా లేవు.కేవలం నాలుగు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. దీన్ని మరోచోటకు తరలించాలని ప్రయత్నించినా ఎక్కడా భవనం దొరకడం లేదు. ఇక మిగిలిన అద్దె భవనాల్లోని హాస్టళ్ల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.



15 ఏళ్లుగా అద్దె పెంకుటింట్లోనే ..

పోడూరు : పోడూరు గ్రామంలో మండల స్థాయిలో బీసీ బాయ్స్ హాస్టల్ ఉంది. మొదట్నించీ 15 ఏళ్లగా అద్దె పెంకుటింట్లోనే దీన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ హాస్టల్‌లో 40 మంది విద్యార్థులు ఉన్నారు. నెలకు రూ.9500 ప్రభుత్వం అద్దె చెల్లిస్తున్నట్లు హాస్టల్ వార్డెన్ కేఎస్‌డీ ప్రసాద్ తెలిపారు. సొంత భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాలుగింటికీ రెండు అద్దె భవనాల్లోనే..

పాలకొల్లు : పాలకొల్లు నియోజకవర్గంలో మొత్తం నాలుగు హాస్టల్స్ ఉన్నాయి. వీటిలో ఇంటర్మీడియట్‌కు చెందిన ఎస్సీ గరల్స్ హాస్టల్, ఎస్సీ బాయ్స్ హాస్టల్ రెండూ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఈ హాస్టళ్లలో 70 మంది విద్యార్థులు ఉన్నారు.శంబునిపేటలో ఎస్సీ గరల్స్ హాస్టల్, జిన్నూరులో ఎస్సీ గరల్స్ హాస్టల్ ఉన్నాయి. ఈ హాస్టళ్లలో 72 మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టల్స్‌లో జాయిన్ అవ్వడానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ఏడాదికి ఏడాది విద్యార్థులు సంఖ్య తగ్గిపోతుంది.



ఆచంటలో ప్రారంభించి వదిలి వేసిన బాలికల వసతి గృహం

గతంలోనే మూతపడిన ప్రైవేటు భవనాలు

ఆచంట : ఆచంట నియోజకవర్గంలో ప్రస్తుతం ఆచంట మండలంలోని వల్లూరు, పెనుమంట్ర మండలంలోని పొలమూరులలో మాత్రమే బాలుర వసతి హాస్టల్స్ ఉన్నాయి. నియోజకవర్గంలో అనేక హాస్టల్స్ అద్దె భవనాల్లో ఉండటంతో 2018లో అద్దె భవనాల్లో నడుస్తున్నవాటిని మూసివేశారు. దీంతో ప్రస్తుతం వల్లూరు, పెనుమంట్రలోనే వసతి గృహాలు ఉన్నాయి. ఆచంట బాలికల వసతి గృహం, వేమవరం బాలుర వసతి గృహాలను ఇటీవలే ప్రారంభించారు. ఆచంట పెదపేటలో ఉన్న బాలికల వసతి గృహాలకు సంబంధించి కాంపౌండ్ హాలు లేకపోవడం సరైన టాయ్‌లెట్స్ లేకపోవడంతో ఇవి ఇంకా విద్యార్థులకు అందుబాటులో రాలేదు. ఆచంట వేమవరంలో బాలుర వసతిగృహం ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు.



అండలూరులో విద్యార్థులు లేక మూసివేసిన హాస్టల్

విద్యార్థులు లేక హాస్టల్ మూసివేత

భీమవరం టౌన్ : చాలాచోట్ల హాస్టల్‌లో వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతుంటే భీమవరం నియోజకవర్గంలోని వీరవాసరం మండలంలోని అండలూరు ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులు లేక మూసివేశారు. అన్ని రకాల సౌకర్యాలతో 2013లో రూ.80 లక్షలతో భవనం నిర్మించారు. అప్పటి ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. నియోజకవర్గంలోని మిగతా వసతి గృహాలకు ఇటీవలే నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టారు. మొత్తం ఆరు హాస్టల్స్‌లో విద్యార్థులకు వసతి సౌకర్యం అందిస్తున్నారు.



తణుకులో శిథిలావస్థకు చేరిన బీసీ హాస్టల్

అరకొర సౌకర్యాలతో అవస్థలు

తణుకు: తణుకులో ఏడు వసతి గృహాలు ఉన్నాయి. పైడిపర్రులో కళాశాలలకు సంబంధించి ఎస్సీ బాలుర వసతి గృహాలు రెండు ఉన్నాయి. ఇరగవరం కాలనీలో బీసీ, ఎస్సీ బాలికలు వసతి గృహాలు రెండు ఉన్నాయి.. తణుకు పట్టణంలో మూడు బాలికల హాస్టళ్లు ఉండగా ఇవి ప్రవేటు భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రైవేటు భవనాలు బాగానే ఉన్నాయి. ప్రభుత్వ భవనాల్లో మాత్రం మరమ్మతులకు గురయ్యాయి. ఇరగవరం కాలనీలో బీసీ వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. శ్లాబులు పెచ్చులు ఊడిపోయాయి. ఇటీవల అక్కడక్కడ మరమ్మతులు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాల్సి ఉంది.

శిథిలావస్థలో తాడేపల్లిగూడెం ఎస్సీ హాస్టల్



తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 9 హాస్టల్స్ ఉండగా వాటిలో నాలుగు హాస్టల్స్ సొంత భవనాల్లో ఉన్నాయి. తాడేపల్లిగూడెం పట్టణంలోని యాగర్లపల్లిలో భవనం శిథిలావస్థకు చేరుకోగా అది నేటికి మరమ్మతులకు నోచుకోలేదు. పెంటపాడులోని ఎస్సీ బాలురు, బాలికల హాస్టల్స్ రెండు ఉండగా పరిమెళ్లలో ఎస్సీ బాలుర హాస్టల్స్ ఉన్నాయి. వాటిని ఇటీవలే సుమారు రూ.18 లక్షలతో అభివృద్ధి చేశారు. మిగిలిన ఐదు హాస్టల్స్ అద్దె భవనాల్లోనే ఉంటున్నాయి. తాడేపల్లిగూడెం సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. గతంలో ఈ హాస్టల్‌లో కనీసం బాత్‌రూంలకు డోర్‌లు కూడా లేకపోవడంతో స్వయంగా కలెక్టర్ నాగరాణి డోర్‌లు పెట్టించాలని సూచించారు. కానీ పిల్లలకు కనీస వసతులు కూడా ఈ హాస్టల్‌లో కరువయ్యాయి. ఈ హాస్టల్ చుట్టూ మురుగు డ్రెయిన్ పేరుకుపోయింది. దీంతో విద్యార్థులకు దోమల బెడద తప్పడం లేదు. ఈ హాస్టల్‌లో పూర్వం 100కి పైగా ఉండేవారు. ఇక్కడ సీటు కావాలంటే రికమండేషన్ తప్పనిసరి. కానీ ప్రస్తుతంతం హాస్టల్‌లో 12 మంది మాత్రమే ఉంటున్నారంటే ఈ హాస్టల్ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

స్థలాలు ఉన్నా భవన నిర్మాణాలు లేవు..

కైకలూరు : ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో వసతులు కరువయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో భవనాలకు రంగులు వేయకపోవడంతో పాడుపడిన భవనాల్లా కనిపిస్తున్నాయి. కైకలూరు నియోజకవర్గంలో బీసీ సంక్షేమ హాస్టళ్ళ దుస్థితి అధ్వానంగా ఉన్నది. ప్రభుత్వ భవనాలు ఉన్నప్పటికీ అవి శిథిలమైపోవడంతో అద్దె భవనాలు, ఇరుకు గదులలో ఎలాంటి వసతి లేని చోట హాస్టల్‌లను నడుపుతున్నారుకైకలూరు సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం భవనం పూర్తిగా ధ్వంసం కావడంతో మూడు కోట్లతో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. ప్రస్తుతం ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ హాస్టల్‌ను రూ. 15 లక్షలతో తాత్కాలికంగా రేకుల హెడ్డు నిర్మాణానికి చేపట్టారు. ముదినేపల్లిలో ఎస్సీ కళాశాలల బాలిక భవనం శిథిలమవడంతో ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్నారు. మూడు కోట్లు ప్రతిపాదనలు చేసినప్పటికీ మంజూరు కాలేదు. దీంతో రూ. 10 లక్షల వ్యయంతో తాత్కలిక షెడ్‌ల నిర్మాణం చేపట్టారు. మండవల్లి ఎస్సీ హాస్టల్‌లో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కలిదిండి ఎస్సీ బాలుర వసతి గృహంలో ప్రహరీగోడలు లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి. బీసీ బాలిక హాస్టల్ భవనం శిథిలమవడంతో కొద్దిపాటి వర్షానికి స్లాబు నుంచి నీరు గదులోకి కారుతున్నాయి.



కైకలూరులో ఎస్సీ బాలికల వసతి గృహంలో తాత్కాలిక హెడ్ నిర్మాణం



ఉండిలోని బీసీ కళాశాల హాస్టల్ భవనం

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

ఉండి : ఉండిలో బీసీ హాస్టల్, ఎస్సీ బాలికల హాస్టల్స్ ఉన్నాయి. ఈ రెండూ సొంత భవనాల్లోనే ఉన్నాయి గతంలో దూరపు ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి చదువుకునేవారు. ప్రస్తుతం హాస్టళ్లలో సిబ్బంద కొరత వేదిస్తోంది. బీసీ హాస్టల్‌లో ముగ్గురు సిబ్బంది ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. అలాగే ఎస్సీ హాస్టల్‌లో ముగ్గురికి ఇద్దరు పనిచేస్తున్నారు.



శ్లాబు పెచ్చులూడుతున్న కైకరం హాస్టల్ భవనం

మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానం

ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలోని పలు హాస్టళ్ళ నిర్వహణ అధ్వానంగా ఉంది. కైకరం ఎస్సీ ప్రత్యేక హాస్టల్‌లో మరుగుదొడ్ల నిర్వహణ విషయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చేబ్రోలు బాలికల ప్రత్యేక వసతి గృహం కూడా సమస్యలతో సతమతమవుతోంది. బొమ్మిడి హాస్టల్ పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంది. హాస్టళ్లకు సంబంధించి తగిన మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

మరమ్మతులు లేవు..

చింతలపూడి : చింతలపూడి సహాయ సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో మూడు మండలాల్లో బాలురు, బాలికల హాస్టల్స్ పది ఉండగా ఇందులో తొమ్మిది ప్రభుత్వ భవనాలే ఉన్నాయి. ఇవికూడా అధ్వానంగా ఉండడంతో ప్రస్తుతం మరమ్మతులు నిర్వహిస్తున్నారు. అయితే దీనికి సంబంధించిన కార్యాలయ భవనం పెచ్చులూడి కిటికీటలు ఊడిపోయి ఉన్నాయి. లింగపాలెం మండలంలోని మూడు హాస్టళ్ళల్లో మరమ్మతులు పూర్తయ్యాయి. కామవరపుకోట, చింతలపూడి మండలాల్లోని ఆరు హాస్టళ్ళల్లో మరమ్మతులు జరుగుతుండగా అద్దె భవనంలో ఉన్న కళాశాల విద్యార్థినుల హాస్టల్‌కు ఎటువంటి మరమ్మతులు చేయడం లేదు. కామవరపుకోట లోని రెండు హాస్టల్స్, ఆడమిల్లిలోని కళాశాల విద్యార్థినుల హాస్టల్‌లో మరమ్మతులు చేపడుతున్నారు. ఇవికాక చింతలపూడి మండలంలో బీసీ హాస్టల్ ఒకటి ఉంది. అదికూడా అద్దె భవనంలో కొనసాగుతుంది.అరకొర సౌకర్యాలు, విద్యార్థులు పెరిగినా సరిపడా సౌకర్యాలు లేవు. మొత్తం పది ఎస్సీ హాస్టళ్ళల్లో గతేడాది బాలికలు 775 మంది కాగా, బాలురు 545 మందికి వసతి సౌకర్యం కలిగింది.



అమీనాపేట బీసీ బాలికల వసతి గృహం

మౌలిక వసతులు కరువు

ఏలూరు రూరల్ : పేద విద్యార్థుల ఉన్నత చదువులే లక్ష్యంగా ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు కరువయ్యాయి. నిర్వహణ లేని మరుగుదొడ్లతో అవస్థలు పడుతున్నారు. చాలీచాలని గదుల్లో పెచ్చులూడి పడుతున్న భవనాల కింద భయంతో గడుపుతున్నారు. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఏలూరులో బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఎస్సీ సంక్షేమ వసతి గృహం అధ్వానంగా ఉండటంతో దానిని మూసివేసి విద్యార్థులను ఏటిగట్టు సెంటర్లో భవనంలోకి మార్చారు. జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ఇటీవల హాస్టళ్లను ఆకస్మిక తనిఖీలు చేశారు. బీసీ వసతి గృహంలో మరుగుదొడ్లతో పాటు కిటికీలు, తలుపులు లేకపోవడం ప్రాంగణం దుర్గంధం వెదజల్లడాన్ని పరిశీలించి మౌలిక వసతులు కల్పనకు ఆదేశాలు ఇచ్చారు.



కూచింపూడిలోని సాంఘిక సంక్షేమ వసతిగృహం

సౌకర్యాలు అంతంత మాత్రమే..

పెదవేగి : పెదవేగి మండలం కూచింపూడిలో సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం ఉంది. 100 మంది వరకు విద్యార్థులు ఈ వసతిగృహంలో ఉంటూ కూచింపూడితో పాటు రామశింగవరం, న్యాయంపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో చదువుకుంటున్నారు. కాగా ఈ వసతి గృహంలో సౌకర్యాలు అరకొరగా ఉన్నాయి. పాడైన మరుగుదొడ్లు, అపరిశుభ్రతమైన ఆవరణ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పాడైన మరుగుదొడ్లకు ఏడాది కిందట కొంతమేర మరమ్మతులు చేశారు. విద్యార్థులు నిద్రించే గదుల్లోనూ పాడైన ఫ్లోర్‌ను కొంతవరకు బాగుచేశారు. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నాటికి వసతి గృహం భవనాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిర్వహణ లేక శిథిలావస్థకు..

పోలవరం : పోలవరం జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ షెడ్యూలు కులాల బాలికల వసతి గృహాన్ని ఇటీవల పునరుద్ధరించారు. అయితే మంచినీటి అవసరాలకు ఆర్వో ప్లాంటు లేకపోవడం వల్ల బయటి నుంచి మంచినీటిని తెచ్చుకుంటున్నారు. పాత పోలవరం కోటదిబ్బపై ఉన్న పాడుపడి శిథిలావస్థకు చేరిన పెంకుటింటి భవనాన్ని వెనుక బడిన కులాల హాస్టల్‌గా వినియోగించేవారు. ఆ గృహాన్ని సైతం ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన అనంతరం పునరుద్ధరించడంతో విద్యార్థుల సమస్యలు తీరాయి. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ సమీపంలో ఉన్న గిరిజన బాలుర వసతి గృహం, జూనియర్ కాలేజి సమీపంలో ఉన్న గిరిజన బాలికల వసతి గృహాలను బోడిగూడెం, చేగొండపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విలీనం చేశారు. నిర్వహణ లేక అవి శిథిలావస్థకు చేరుకున్నాయి.

రేపటి నుంచి బండి ముత్యాలమ్మ జాతర

మొగల్తూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ జాతర మహోత్సవంతో అమ్మవారి కీర్తిని మరింత పెంచుదామని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ పిలుపునిచ్చారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 9వ తేది వరకూ జరిగే అమ్మవారి జాతరపై శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆర్డీవో దాసిరాజుతో కలిసి వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ పరిధిలోని నాలుగు గ్రామ పంచాయతీల పరిధిలో జాతరలో ప్రధాన పాత్రపోషించే మూడు సామాజిక వర్గాలు ఐకమత్యంతో భక్తి భావంతో ముందుకు సాగాలని వివాదాలు, గొడవలు, అల్లర్లుకు తావులేకుండా గ్రామస్థులంతా పూర్తిగా సహకరించాలని కోరారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఉత్సవ కమిటీ ప్రత్యేక అధికారి సూర్యప్రకాష్ మాట్లాడుతూ జాతర నిర్వహణకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, అగ్ని మాపకశాఖల నుంచి అవసరమయ్యే సహకారాన్ని వివరించారు.ఆర్డీవో దాసిరాజు మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీరు, నాణ్య మైన ప్రసాదం అందించే ఏర్పాట్లుపై తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, ఆలయ కమిటీ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ కొల్లాటి బాలకృష్ణ, ఈవోలు మోకా అరుణ్ కుమార్, డి.రామ కృష్ణంరాజు, తోట శ్రీనివాస్, తహసీల్దార్ కె.రాజ్ కిషోర్, ఎంపీడీవో త్రిశూలపాణి, సీఐ దుర్గా ప్రసాద్, ఎస్ఐ జి.వాసు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయకర్, ఆర్డీవో, డీఎస్పీ, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ తదితరులు

టీచర్ల బదిలీ దరఖాస్తుకు యూటీఎఫ్ హెల్ప్‌డెస్క్

ఏలూరు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల బదిలీలు, సర్దుబాట్లపై శుక్రవారం ఏలూరు యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బదిలీలకు సంబంధించిన జీవోలపై ఉపాధ్యాయుల సందేహాలు, సమస్యలపై పరిష్కారాలను తెలియజేశారు. ఆన్‌లైన్‌లో బదిలీ దరఖాస్తు చేసుకునేందుకు సంఘ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. ఈ డెస్క్ ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు, సాయంత్రం 5నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు ప్రకటించారు. జిల్లా ప్రధాన నాయకులు సంఘ కార్యాలయంలో అందుబాటులో ఉండి టీచర్లకు వచ్చే సమస్యల పరిష్కారానికి డీఈవో కార్యాలయ అధికారులతో మాట్లాడడంతో పాటు, రాష్ట్రస్థాయి సమస్యలను విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతారని వివరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అలీ, రవికుమార్, నాయకులు సుభాషిణి, రంగమోహన్, రాంబాబు, అంజన, కమల్‌కుమార్, జక్రియ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నిమ్మలకు సమస్యలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు, రైతులు

ప్రతి కాల్వను ఆధునీకరిస్తాం

త్వరలో డీపీఆర్ : మంత్రి నిమ్మల రామానాయుడు

నరసాపురం రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాలో ప్రతి కాల్వను ఆధునీకరిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. రాడార్ సాయంతో కాల్వల ఆధునీకరణ పనులపై సర్వే చేస్తున్నామని, త్వరలో డీపీఆర్ సిద్ధం చేస్తామన్నారు. సరిపల్లిలో రూ.56 లక్షలతో డ్రెయినేజీల తవ్వకం పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ వ్యవసాయంపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదన్నారు. గత ఐదేళ్లలో తట్ట మట్టి, లాకులకు గ్రీజ్ పెట్టకుండా ఇరిగేషన్ వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. కొన్ని ప్రాంతాల్లో సార్వా పంటను వదులుకోవాల్సి వచ్చిందన్నారు. ఎక్కువ గోదావరి జిల్లాల్లోనే ఈ పరిస్థితి కనిపించిందన్నారు. గత ఐదేళ్ల రైతు వ్యతిరేక పాలన సాగిందన్నారు. కూటమి రైతు పక్షపాత ప్రభుత్వం అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో సొమ్మును ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. పశ్చిమలో ఇప్పటి వరకు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, 73వేల మంది రైతుల ఖాతాల్లో రూ.1281కోట్లు జమ చేశామన్నారు. మరో 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించామన్నారు. విప్ నాయకర్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, రైతులతో కలిసి సరిపల్లి, నత్తలావ, 5 తూముల మురికి కాల్వలను ఆధునీకరించడంతో పాటు లాకుల మరమ్మతులు చేపట్టాలని, పంట కాల్వలను ప్రక్షాళన చేయాలని మంత్రికి వినతిపత్రం అందించారు. టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార సహకార సంఘాల సమ్మెళ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు, డీఈ మోహన్‌కృష్ణ, గుబ్బల మార్రాజు, సర్పంచ్ ఈదా సురేష్‌బాబు పాల్గొన్నారు.

మంచిలి లింక్ రోడ్డు అభివృద్ధికి రైల్వే గ్రీన్ సిగ్నల్

భీమవరంటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): మంచిలి - ఆరవల్లి మధ్య రైల్వే లెవల్ క్రాసింగ్ 138 నుంచి 136 వరకు లింక్ రోడ్డు అధ్వానం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాలని మంచిలి గ్రామస్తులు తీర్మానం చేసి కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేంద్ర మంత్రి వర్మ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు లేఖ రాశారు. 840 మీటర్ల పొడవు, 5.5 మీటర్ల వెడల్పుతో సిమెంట్ రోడ్డు నిర్మించాలని కోరారు. రోడ్డు అభివృద్ధికి ప్రణాళిక తయారు చేశామని, ఆమోదం అనంతరం పనులు ప్రారంభిస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కేంద్రమంత్రికి లేఖ రాశారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రైల్వే అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు

ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత హెచ్చరిక



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీలత

ఏలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మద్యం అక్రమ విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత హెచ్చరించారు. శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎక్సైజ్‌శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్, డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాల మేరకు మద్యం దుకాణాల వద్ద నిఘా ఉంచామన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మద్యం విక్రయించాలన్నారు. నిబంధనలు అతిక్రమించి కిళ్లీ దుకాణాలు, ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సమయ పాలన పాటించేలా సంబంధిత స్టేషన్ల తనిఖీ అధికారులు రాత్రి గస్తీ నిర్వహించి, అక్రమ అమ్మకాలను నిరోధించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. అనధికారిక సమయాల్లో అమ్మకాలు జరిపిగే ఆయా దుకాణాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీసీ శ్రీలత హెచ్చరించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్, జిల్లా సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించండి

మంత్రి కొలుసు



ఎన్టీఆర్ వైద్యసేవ పొందుతున్న రోగులను పరామర్శిస్తున్న మంత్రి పార్థసారథి

ఏలూరు టూటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ రోగులకు మెరుగైన సేవలందించాలని ఆశ్రం ఆసుపత్రి వైద్యులను మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. ఆశ్రం ఆసుపత్రిని మంత్రి పార్థసారథి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవలో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ కోసం వచ్చే వారికి సంతృప్తి చెందేలా చికిత్స అందించాలన్నారు.గుండెపోటు,రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర సేవల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన వారికి వెంటనే చికిత్స అందించాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

డబ్బు వసూలు చేసే నెట్‌వర్క్ ఆస్పత్రులపై చర్యలు

ఏలూరు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద జిల్లాలో నమోదైన నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో రోగులనుంచి ఉచిత వైద్యానికి కూడా డబ్బులు తీసుకుంటున్నారనే అభియోగాలపై 23 ప్రైవేటు, 7 ప్రభుత్వ ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీచేశామని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ శుక్రవారం తెలిపారు. 'డబ్బులిస్తేనే ఉచిత వైద్యం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 99 ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులు ఎన్టీఆర్ వైద్య సేవ పథకంకింద ఉచిత వైద్యసేవలందించేందుకు నెట్‌వర్క్ ఆసుపత్రులుగా రిజిస్టరయ్యాయన్నారు. ఈ ఆసుపత్రులపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ కాల్స్‌ద్వారా రోగులనుంచి సేకరించిన సమాచారంలో 30 నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు డబ్బులు వసూలుచేసినట్టు ఫిర్యాదులు వచ్చాయన్నారు. సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యాలకు షోకాజ్ నోటీసులు జారీచేయడంతోపాటు, వైద్యమిత్రల ద్వారా విచారణ చేయిస్తున్నామని వివరించారు. విచారణలో డబ్బుల వసూళ్లు నిర్ధారణ అయితే ఆయా ఆసుపత్రులపై తగిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ రాజీవ్ పేర్కొన్నారు.

రైతులకు ఏ ఇబ్బంది వచ్చినా తక్షణం పరిష్కరిస్తున్నాం. వారి బాగోగులపై శ్రద్ధ పెట్టాం. ఏ పంట పండించినా సరే రైతు ఇబ్బంది పడకుండా అధికారులను రంగంలోకి దింపుతున్నాం. ప్రభుత్వమే నేరుగా కదిలి వచ్చి పరిష్కారం చూపుతుంది. కోకో రైతుల కష్టాలను తీరుస్తాం. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని వ్యవసాయ శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు.

రైతుల కోసమే ప్రభుత్వం

- ఏలూరులో కోకో రైతుల సమావేశం
- సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- కొనుగోళ్లకు కంపెనీల అంగీకారం
- మంత్రి అచ్చెన్నాయుడు



ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన కోకో రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, వేదికపై మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యేలు బడేటి చంటి, కామినేని శ్రీనివాస్, కలెక్టర్ వెట్రిసెల్వి, తదితరులు

ఏలూరు, మే 23(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతు పండించిన పంటకు మద్దతు ధర కల్పించడమే కాకుండా వారి బాగోగులపై తక్షణం స్పందిస్తున్నామని వ్యవసాయ శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. కోకో రైతుల సమస్యలపై శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కోకో కొనుగోలుపై ఒక నిర్ణయం తీసుకున్నామని, మధ్యస్థ ధర ఉండేలా కంపెనీలతో మాట్లాడినట్లు తెలిపారు. కంపెనీలు రూ.450 ధరకే కొనుగోలు చేస్తామని చెప్పినప్పటికి మరో రూ.50 ప్రభుత్వం భరించి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. రైతుల వద్ద ఉన్న కోకో గింజలను రూ.500 ధరకు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో ఆధారిత ఉత్పత్తులు తగ్గడంతో సమస్య ఏర్పడిందన్నారు. భవిష్యత్తులో కోకోకు కూడా ఒక చట్టం తెచ్చే యోచనలో ఉందన్నారు. కోకో పంట నాణ్యతపై రైతులకు శిక్షణ ఇచ్చే ప్రయత్నాలు చేస్తామన్నారు.

కోకో పంటకు ధర ఇవ్వడంలో ట్రేడర్లు కంపెనీలు విఫలమవుతున్నాయని మంత్రి పార్థసారథి అన్నారు. దళారి వ్యవస్థ లేకుండా కంపెనీలకు నేరుగా రైతులు కోకో గింజలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోకో పంటకు గత ఏడాది, ప్రస్తుత ధరకు చాలా వ్యత్యాసం ఉండటంతో ధర నిర్ణయంపై కంపెనీలు నిర్దిష్ట విధానం అవలంబించాలన్నారు.

కోకో రైతుల సమస్యలు తెలిసిన వెంటనే స్పందించాం. రైతులు, ట్రేడర్‌లు, కంపెనీలతో ప్రత్యేకంగా సమావేశం కావడం శుభపరిణామమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సమస్య పరిష్కరించేందుకు కృషి చేసిన మంత్రులకు ధన్యవాదాలు

గత ఏడాది కోకో కిలో రూ.900 పైగా ధర పలికిందని, ప్రస్తుతం రూ.300-రూ.400 ఉందని రైతు వెంకటేశ్వరరావు అన్నారు. కొనుగోలులో కంపెనీలు రైతులకు ఎన్నో షరతులు పెడుతున్నాయి. తేమ శాతం, పంగస్ పేరుతో తక్కువ ధరకు కొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, ఉద్యాన వనశాఖ డైరెక్టర్ శ్రీనివాస్, కలెక్టర్ వెట్రి సెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాషా, రైతు సంఘం నాయకులు శ్రీనివాస్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కోకో ధర తగ్గడంలో కంపెనీల కుట్ర : రైతుల నిరసన



మోకాళ్లపై కూర్చుని కోకో రైతుల నిరసన

ఏలూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): కోకో గింజల ధరపై ప్రభుత్వం నిర్వహించిన ద్వైపాక్షిక చర్చలు విఫలమైనట్లు ఏపీ కోకో రైతుల సంఘం నాయకులు ప్రకటించారు. కోకో గింజలను అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకుండా బహుళజాతి కంపెనీల మోసాలకు నిరసనగా కలెక్టరేట్ శుక్రవారం కోకో రైతులు ధర్నా నిర్వహించారు. కోకో రైతులకు న్యాయం చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వాలని, కార్పొరేట్ కంపెనీల మోసాలను అరికట్టాలని నినాదాలు చేశారు. కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 3 నెలలుగా కోకో రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నారని, గత వారం రోజులుగా పోరాటాన్ని ఉధృతం చేశామన్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల సమక్షంలో చర్చలకు మోండలీజ్ కంపెనీ ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడడాన్ని ఖండించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలు రూ.880 ఉంటే మోండలీజ్ కంపెనీ రూ.450కు మించి ధర ఇవ్వలేమని చెప్పడం దుర్మార్గం అన్నారు. ఇది బహుళజాతి కంపెనీల కుట్రలో భాగమని విమర్శించారు. రాష్ట్ర మంత్రులు ప్రకటించిన నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. రైతు సంఘం నేతలు కె.శ్రీనివాస్, వై.కేశవరావు, మాగంటి హరిబాబు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలను బుజ్జగించేవిధంగా చర్చలు సాగడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.గోపాలకృష్ణ, బొల్ల రామకృష్ణ, బోళ్ళ వెంకట సుబ్బారావు, ఉప్పుగంటి భాస్కరరావు, పానుగంటి అచ్యుతరామయ్య, గుదిబండి వీరారెడ్డి, ఉప్పల కాశీ, కొప్పిశెట్టి ఆనంద వెంకట ప్రసాద్, కోనేరు సతీష్‌బాబు, చింతకాయల బాబురావు, ఇతర జిల్లాల రైతులు పాల్గొన్నారు.

ఒకే ప్రాంతానికి రెండు ఎంపీ పదవులు అరుదు

28న రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం : పాకా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాకా సత్యనారాయణ

భీమవరం టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఒకే పార్టీ నుంచి ఒకేచోట ఇద్దరు పార్లమెంట్ సభ్యుల ఎంపిక చాలా అరుదు అని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవితో కలసి శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ నుంచి శ్రీనివాస వర్మ ఎంపీగా ఎన్నిక కాగా తాను రాజ్యసభకు ఎన్నిక కావడాన్ని ప్రస్తావించారు. భౌగోళికంగా తామిద్దరం ఒకే ఊరి వాళ్లం అన్నారు. తాను రాష్ట్రమంతటా పనిచేస్తున్న విషయం పార్టీ అధిష్ఠానానికి తెలుసన్నారు. ఈ నెల 28న తాను ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. మా ప్రాంత అభివృద్ధిలో లోక్‌సభ సభ్యుడు, మంత్రి శ్రీనివాస్ వర్మకు తాను కూడా చేదోడు వాదోడుగా ఉండడానికి, మరింత అభివృద్ధి చేయడానికి వీలు కలుగుతుందని సత్యనారాయణ అన్నారు. తన ఎంపికపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర కమిటీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి పని చేసే కార్యకర్తకు గుర్తింపు ఇవ్వ గలిగిన సత్తా కలిగిన పార్టీ అని, వెనుకబడిన తరగతులకు చెందిన నాయకుడికి సముచిత స్థానం కల్పించిన పార్టీగా బీజేపీ నిరూపించుకుంద న్నారు. అత్యున్నత పదవిగా భావించే రాజ్యసభకు ఎంపిక చేసే వారిని కుల మతాలు చూడకుండా పార్టీకి నిబద్ధ త క్రమశిక్షణ ఆధారంగానే కాకుండా విషయాలపై అవగాహన, తదితర అంశాలను ప్రామా ణికంగా తీసుకుని తనను ఎంపిక చేసినట్లు వివరిం చారు. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారనికి 28న ఉప రాష్ట్రపతి అవకాశం కల్పించారని పాకా సత్యనా రాయణ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రోటోకాల్‌ను గౌరవిస్తూ ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ వెళుతున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు అల్లూరి సాయి దుర్గరాజు, కోమటి రవికుమార్, బీజేపీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జి ఉన్నమట్ల కపర్ది, నారిన తాతాజీ, అడబాల శివ, వబిలిశెట్టి ప్రసాదరావు, అల్లూరి పద్మ వర్మ, కాగిత సురేంద్ర, ఇంజేటి వెంకటేశ్వర్లు, పెదప్రోలు రాఘవులు, పుల్లాజి, తోట గంగరాజు, గంగుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం అనుమానంతో

ఆటో డ్రైవర్‌ను చంపేశాడు

- అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాల్వలో మృతదేహం లభ్యం
- పోలీసుల అదుపులో ముగ్గురు

భీమవరం క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): అనుమానమే పెనుభూతమైంది. తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న అనుమానంతో ఆటో డ్రైవర్‌ను మూటలో కట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. ఈ సంఘటన భీమవరం పట్టణంలో సంచలనమైంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిన రంగనిపాలెంలో ఉండే కాటూరి దుర్గారావు (28)కు పదేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో కొన్నేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. వేరే వ్యక్తిని వివాహం చేసుకుంది. దుర్గారావు ఒంటరిగా ఉంటున్నాడు. యాళ్ల కోటేశ్వరరావు (బాబి) వద్ద ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

కొన్నాళ్లుగా దుర్గారావుపై అనుమానం

తన వద్ద ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న కాటూరి దుర్గారావు తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని బాబి అనుమానం పెంచుకున్నాడు. బాబి కూడా షేక్ మేరీ అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. వారిద్దరిపై అనుమానం పెంచుకున్న కోటేశ్వరరావు దుర్గారావును పిలిచి అడగడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దుర్గారావు తాను అలాంటి వాడిని కాదని బాబికి నచ్చజెప్పాడు. అయినా కూడా బాబి కక్ష పెంచుకున్నాడు.

పథకం ప్రకారం హత్య

యాళ్ల బాబి సొంత ఊరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వెదిరేశ్వరం. దుర్గారావును అక్కడికి తీసుకువెళ్లి బెదిరించి ఏదో ఒకటి చేయాలని బాబి నిర్ణయించుకున్నాడు. ఈ నెల 4న దుర్గారావును బాబి పని ఉందని ఇంటికి తీసుకువెళ్లాడు. అక్కడ బాబి, అతడి భార్య మేరీ, వారి పదహారేళ్ల కుమారుడు కలిసి దుర్గారావుపై దాడి చేశారు. దుర్గారావుకు తీవ్ర గాయాలు కావడంతో వెదురేశ్వరం తీసుకువెళ్లి బెదిరించాలని చూశాడు. దుర్గారావు కాళ్లు, చేతులు, నోరు కట్టి గోనె సంచిలో మూటగట్టారు. అనంతరం బాబి, అతని కుమారుడు కలిసి ఆటోలో వెదిరేశ్వరం తీసుకువెళ్లేందుకు బయలుదేరారు. మార్గమధ్యలో దుర్గారావు కదులుతూ ఉండడంతో సంచిని మరింత గట్టిగా తాడుతో కట్టేశారు. వెదిరేశ్వరం వెళ్లేసరికి దుర్గారావు మృతి చెందాడని నిర్ధారించారు. ఏం చేయాలో తోచని స్థితిలో తండ్రీకొడుకులు దుర్గారావు మృతదేహాన్ని అదే ఆటోలో రావులపాలెం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జొన్నాడ కాలువలో మృతదేహాన్ని విసిరివేశారు. అనంతరం ఏమీ తెలియనట్లు తండ్రీ కొడుకులు వెనక్కి వచ్చేశారు.



దుర్గారావు (ఫైల్)

సోదరుడి అదృశ్యంపై ఫిర్యాదు

కాటూరి దుర్గారావు ఈ నెల 4 నుంచి కనిపించక పోవడంతో అతడి సోదరుడు నాగరాజు అన్నిచోట్ల వెదికాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఈ నెల 21న యాళ్ల బాబిపై అనుమానం వ్యక్తం చేస్తూ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు వారి కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. బాబి, అతడి భార్య మేరీ, వారి కుమారుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో పోలీసులు జొన్నాడ కాలువలో కుళ్లిపోయి ఉన్న మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహానికి రావులపాలెం ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. తన వద్ద పని చేస్తున్న యువకుడిపై అనుమానం పెంచుకున్న బాబి ఇలా చేయడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి దుర్గారావు బంధువులు, స్నేహితులు పోలీస్ స్టేషన్ వద్ద నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ధర్నాకు కూడా దిగారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎన్.నాగరాజు తెలిపారు.



మునిసిపల్ కార్యాలయం వద్ద మృతుని బంధువులు, కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్) అచ్చయ్య (ఫైల్)

విద్యుదాఘాతంతో కూలీ మృతి

తాడేపల్లిగూడెం రూరల్, మే23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీధిలైట్ల కాంట్రాక్ట్ పనిలో చెట్టుకొమ్మలు నరుకుతున్న కూలీ రాపాక అచ్చయ్య (35) విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందాడు. కుంచనపల్లికి చెందిన అచ్చయ్య పట్టణంలో వీధిలైట్‌ల కాంట్రాక్టర్ వద్ద చెట్లు నరికే పనికి వచ్చాడు. కోడే వెంకట్రావు స్కూల్ వద్ద చెట్టు కొమ్మలు నరుకుతుండగా విద్యుదాఘాతంతో కింద పడిపోయాడు. వెంటనే 108 వాహనంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. అచ్చయ్యకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎలాంటి రక్షణ లేకుండా చెట్ల నరికే పనిలో పెట్టి అచ్చయ్య మృతికి కారణమైన వారు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయు నాయకులు, మృతుని బంధువులు మునిసిపల్ కార్యాలయం వద్ద మృతదేహంతో నిరసన తెలిపారు. కమిషనర్, స్ట్రీట్‌లైట్ కాంట్రాక్టర్ కుటుంబ సభ్యులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బాదం శ్రీను తెలిపారు.

లారీని ఢీకొన్న వ్యాన్ : ఒకరి మృతి

ఉంగుటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వ విద్యాలయం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన చిడిపి సాయి గణేష్(21)అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం నబీపేటలో క్రైస్తవ సభలకు సౌండ్ సిస్టం తీసుకువెళ్లారు. తిరిగి గురువారం అర్ధరాత్రి ఉంగుటూరు మండలం చినవెల్లమిల్లి బయలుదేరారు. తెల్లవారుజామున వెంకట్రామన్నగూడెంలో ఆగి ఉన్న లారీని వ్యాన్ ఢీకొంది. వ్యాన్ డ్రైవర్ పవన్‌కు స్వల్పగాయాలు కాగా క్యాబిన్‌లో కూర్చున్న పోతవరం గ్రామానికి చెందిన చిడిపి సాయి గణేష్(21) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. క్యాబిన్‌లో కూర్చున్న మానెల్లి వేణు(వెల్లమిల్లి), చేపల రవి(నబీపేట) తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసును చేబ్రోలు ఎస్సై ఎం.సూర్యభగవాన్ దర్యాప్తు చేస్తున్నారు.

వందేభారత్ ఢీకొని వివాహిత మృతి

ఏలూరు క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతున్న మహిళను వందేభారత్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బాపులపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పొల్లూరి కావ్య (24) శుక్రవారం ఉదయం నూజివీడు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా వందే భారత్ రైలు ఢీకొనడంతో కావ్య అక్కడికక్కడే మృతి చెందింది. ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్‌కు సమాచారం అందడంతో తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యాచకుడి ఆత్మహత్య

భీమవరం క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి వంతెనపై వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఓవర్ బ్రిడ్జి పై నుంచి మృతదేహం వేలాడుతున్నట్లు శుక్రవారం ఉదయం పోలీసులకు సమాచారం అందింది. సుమారు 60 ఏళ్ల వృద్ధుడు యాచక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు అక్కడి వారు తెలిపారు. శుక్రవారం ఉదయం తన లుంగీతోనే ఉరి వేసుకున్నాడు. అతనికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని వన్‌టౌన్ ఏఎస్ఐ షేక్ బాజీ తెలిపారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి) : వృద్ధుడు తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. శనివారపుపేట హైస్కూలు రోడ్డులో దారుగ చక్రధరరావు (76) ఒక్కడే నివాసం ఉంటున్నాడు. మరో పోర్షన్‌లో అతని కుమారుడు సత్యనారాయణ తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో కొద్ది రోజుల క్రితం సత్యనారాయణ తన కుటుంబ సభ్యులతో ఊరు వెళ్ళాడు. శుక్రవారం వచ్చేటప్పటికి తండ్రి చక్రధరరావు మృతితో దుర్గంధం వెదజల్లుతూ ఉంది. త్రీటౌన్ పోలీసులకు సత్యనారాయణ ఫిర్యాదు చేశారు.

వేసవి సెలవుల్లో ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు నడుపుతున్నారు. 08581 విశాఖపట్టణం - ఎస్ఎంవీటి బెం గళూరుకు ప్రతి ఆదివారం జూన్ 1 నుంచి జూన్ 29 వరకూ నడుపుతున్నారు. 08582 ఎస్ఎంవిటి బెంగుళూరు - విశాఖపట్టణానికి ప్రతి సోమవారం జూన్ 2 నుంచి జూన్ 30 వరకూ నడపనున్నారు. ఈ రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యల మంచిలి, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, జాలర్ పెట్టయ్, కుప్పం, బంగరపేట, కృష్ణరాజపురం స్టేషన్లలో ఆగుతుంది. రైల్ నెంబర్ 08547 విశాఖపట్టణం-తిరుపతి ప్రతి బుధవారం జూన్ 4 నుంచి జులై 30 వరకూ నడపనున్నారు. 08548 తిరుపతి - విశాఖపట్టణానికి ప్రతి గురువారం జూన్ 5 నుంచి జులై 31 వరకూ నడపనున్నారు. దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట స్టేషన్లలో ఆగుతాయి. రైల్ నెంబర్ 08579 విశాఖపట్టణం - చర్లపల్లి ప్రతి శుక్రవారం జూన్ 6 నుంచి జులై 25 వరకూ నడపనున్నారు. 08580 చర్లపల్లి - విశాఖపట్టణం ప్రతి శనివారం జూన్ 7 నుంచి జులై 26 వరకూ నడపనున్నారు. దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ళు, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్లల్లో టూటైర్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఉంటాయని అధికారులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో

ఒకరి ఆత్మహత్య



శ్రీనివాసరావు (ఫైల్)

పెదపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): పెదపాడు గ్రామ శివారు రామచంద్రపురం గ్రామానికి చెందిన గురజాపు శ్రీనివాసరావు (35) ఆర్థిక ఇబ్బందులతో తన ఇంటిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. వడ్రంగి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొద్ది రోజుల క్రితం భార్య, కుమార్తెలను భార్య స్వంత ఊరు తీసుకెళ్లినట్లు శ్రీనివాసరావు దింపి వచ్చినట్లుగా స్థానికులు చెబుతు న్నారు. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటం స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీఆర్వో నరసింహా ఇచ్చిన సమాచారం ఎస్సై కట్టా శారద సతీష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు గొలుసు చోరీ

కుక్కునూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): గొమ్ముగూడెం గ్రామానికి చెందిన పోలుగపాటి కుమారి బంగారు గొలుసు గురువారం రాత్రి అపహరించారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అర్ధరాత్రి 2గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న 30 గ్రాముల గొలుసు లాక్కుపోయాడు. ఈ పెనుగులాటలో ఆమె మెడపై గాయాలయ్యాయి. బాధిత మహిళ భర్త దొంగతనం చేసిన వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం చేసినా పారిపోయాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

25న ఏపీజీఈఏ జిల్లాకార్యవర్గ ఎన్నికలు

ఏలూరు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వోద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) ఏలూరుజిల్లాశాఖ ఎన్నికలు, జిల్లా కౌన్సిల్ సమావేశం ఈ నెల 25న ఏలూరు టీటీడీ కల్యాణమండపం సమీపంలోని సంఘ కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు జరుగుతాయని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాము, రామకృష్ణారావు తెలిపారు. ఎన్నికల పరిశీలకునిగా సంఘ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేదారేశ్వరరావులు హాజరవుతారని వివరించారు.

ఎక్సైజ్ కేసులో రూ.25 వేల జరిమానా

చింతలపూడి, మే 23 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీకి చెందిన వి.మహేష్ బైండోవర్ ఉల్లంఘించి తిరిగి బెల్లం సరఫరా చేసినందుకు తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయగా 25 వేల రూపాయల జరిమానా విధించినట్టు చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. మండలంలో దాడులు చేయగా తలార్లపల్లి గ్రామంలో దారావత్ శ్రావణికి చెందిన 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఆమెపై పరారీ కేసు, గుంటుపల్లిలో ఎం.శ్రీనివాసరావుపై పరారీ కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

మద్ది ఆంజనేయ స్వామి గ్రామోత్సవం


ప్రత్యేక వాహనంలో కొలువు తీరిన మద్ది ఆంజనేయ స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులు

జంగారెడ్డిగూడెం, మే 23 (ఆంధ్రజ్యోతి): మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వారికి వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఈఓ ఆర్‌వి.చందన తెలిపారు. శాస్త్రోక్తంగా సువర్చలా హనుమత్ కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంలో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. మద్ది ఆలయం నుంచి గురవాయిగూడెం, చక్రదేవరపల్లి గ్రామాల్లో మేళతాళాలు మధ్య స్వామివారిని ఊరేగించారు. అయినవిల్లికి చెందిన భక్తురాలు సుస్మిత రూ.51,160 నగదు ఆలయ పర్యవేక్షకులు కె.రంగారావుకు అందజేశారు.

మనిషి జీవన నాణ్యత పెంచేందుకు యోగా మార్గం: కలెక్టర్



పెదపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా కనీసం రెండు కోట్ల మందికి యోగాలో ప్రవేశం లక్ష్యంతో యోగాంధ్ర ప్రచార కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీ తెలిపారు. పెదపాడు మండలం వట్లూరులోని టెక్నికల్ ట్రైనింగ్ శిక్షణ సంస్థ (టీటీడీసీ)లో నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజు యోగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికారులు తగిన కార్యాచరణను రూపొందించాలని కలెక్టర్ వెట్రిసెల్వీ ఆదేశించారు. మనిషి జీవన నాణ్యతను పెంచేందుకు, శ్రేయస్సుకు, యోగా ఒక మార్గమని అన్నారు.

సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తా : ఎస్పీ


సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సిబ్బందికి శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి సిబ్బంది నుంచి వినతులను ఎస్పీ స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సివిల్ కానిస్టేబుళ్ళు, హోంగార్డులు తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. సమగ్రంగా విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎస్పీ హామీ ఇచ్చారు.

బాలికల ఉన్నతికి విద్య అవసరం

ద్వారకాతిరుమల, మే 23(ఆంధ్రజ్యోతి): బాలికల అభివృద్ధికి విద్య అవసరమని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ టి.మేరీ అన్నారు. తిరుమలంపాలెం -2 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం 2.0 సెషన్స్ కార్యక్రమం జరిగింది. బడి మానేసిన పిల్లలు ఓపెన్ స్కూల్ ద్వారా చదువుకోవచ్చని, మాధ్యమిక స్థాయిలో విద్యార్థులు బడిలో ఉండే ఆవశ్యకతను వివరించారు. మహిళా కార్యదర్శి ఎస్కె. ఆఫ్రీన్ మాట్లాడుతూ ఆడపిల్లలకు చదువు ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో బాలికలతో యోగా చేయించారు. అనంతరం గ్రామంలో ర్యాలీగా తిరుగుతూ బాలికలకు విద్య ఆవశ్యకతను వివరించారు.

పాడి రైతులు పాల దిగుబడులు పెంచాలి


పాడి రైతులకు ప్రోత్సాహకాలను అందిస్తున్న పాల ఉత్పత్తిదారుల చైర్మన్ నాగేశ్వరరావు

ద్వారకాతిరుమల, మే 23(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పాల దిగుబడులను పెంచి ఆర్థికంగా ఎదగాలని కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఉత్పత్తిదారుల సంఘ చైర్మన్ జీఎస్ రావు అన్నారు. రాజుపాలెంలో కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో అధిక పాల దిగుబడులు సాధించిన రైతులకు బోనస్‌లు, పాలక్యాన్‌లను ప్రోత్సాహకంగా అందజేశారు. ఇందులో ప్రథమ బహుమతి డివి చౌదరి, ద్వితీయ మానికల శ్రీనివాసరావు, మూడవ బహుమతి దేవరపల్లి రాయుడుబాబుకు అందజేశారు. సర్పంచ్ దేవరపల్లి నర్సమాదేవి, రాజుపాలెం పాల ఉత్పత్తి సంఘ అధ్యక్షుడు మనవర్తి శ్రీరాములు పాల్గొన్నారు.

క్షేత్రానికి ఎడారి ఓడ



ద్వారకాతిరుమల, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎడారి ఓడగా పిలిచే ఒంటె ద్వారకాతిరుమలలో తిరుగాడుతూ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఒంటె అటు యాత్రికులతో పాటు స్థానికులను ఆకట్టుకున్నది. ఓ వ్యక్తి దానిని ముస్తాబు చేసి తీసుకొచ్చి ఆలయానికి వచ్చిన యాత్రికుల నుంచి యాచన చేస్తున్నాడు.

యోగాతో ఒత్తిడి నుంచి ఉపశమనం

ఉంగుటూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎన్నో ఒత్తిళ్లు ఉండడంతో మానసికంగా ఇబ్బందులు పడకుండా యోగా శిక్షణ తీసుకుంటే ఉప శమనం పొందవచ్చని యోగా శిక్షకులు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు కమ్యూనిటీ హాలులో జరిగిన యోగా శిక్షణ, అవగాహన కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిణి డా.కస్తూరి శిరీష, మందా జయలక్ష్మి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.


ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నియామకం

జంగారెడ్డిగూడెం,మే 23 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ప్రకటించారు. ఛైర్మన్‌గా ఎమ్మెల్యే రోషన్‌కుమార్, సభ్యులుగా కంచర్ల గణేష్ కుమార్, నాయుడు శ్రీను, దెందుకూరి వెంకటలక్ష్మి (రాజీ), మెప్మా నుంచి కోటగిరి ప్రమీలను నియమించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు దాసరి శేషు,రావూరి కృష్ణ,పెనుమర్తి రామ కుమార్, షేక్ ముస్తఫా తదితర నాయకులు మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో కొందరి వైద్య సిబ్బంది నిర్లక్ష్య ధోరణి వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళారు.

వాటర్ వర్కర్స్‌కు జీతాలు ఇవ్వాలి

కొయ్యలగూడెం, మే 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి డ్రింకింగ్ వాటర్ వర్కర్స్‌కు జీతాలు విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 27న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆ యూనియన్ గౌరవ అధ్యక్షుడు డేగా ప్రభాకర్ కోరారు. ఈమేరకు శుక్రవారం కొయ్యలగూడెం మార్కెట్‌యార్డు ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్మికులకు 9నెలల నుంచి జీతాలు ఇవ్వంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షుడు శివసత్యనారాయణ, మండల సీపీఐ అధ్యక్షుడు అంజనేయరాజు, సత్యనారాయణ, ప్రసాద్, వీరబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు..పెదవేగిలో అత్యధికం

ఏలూరుసిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగాను, బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగాను జిల్లాలో పలు ప్రాంతాల్లో శుక్రవారం కూడా వర్షాలు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోను శుక్రవారం విభిన్న వాతావరణం ఏర్పడింది.జిల్లాలోని చాలా ప్రాంతాల్లో తెల్లవారుఝామున వర్షం కురిసినా మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత కనిపించింది. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా పెదవేగి మండలంలో 32.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 8.2 మిల్లీమీటర్లుగా నమోదైంది. మరో వారం రోజుల పాటు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులతో పాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో మిగిలిన మండలాల్లో వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. ద్వారకాతిరుమలలో 32, ఉంగుటూరులో 24.4, బుట్టాయిగూడెంలో 22.8, ముసునూరులో 21.6, నూజివీడులో 20.4, పోలవరంలో 18 భీమడోలులో 12.6, కామవరపుకోటలో 12.2, జీలుగుమిల్లిలో 7.4, నిడమర్రులో 6.8, కొయ్యలగూడెంలో 4.6, లింగపాలెంలో 4.2, జంగారెడ్డిగూడెంలో 4.2, చింతలపూడిలో 2, టి నరసాపురంలో 1.4, దెందులూరులో 1.2 మిల్లీమీటర్లు నమోదు అయ్యాయి.

కుళ్లిన మధ్యాహ్న భోజన బియ్యం

లక్కవరం హైస్కూల్‌లో ఘటన.. ఎంఈవో విచారణ


కుళ్లిపోయిన బియ్యం బస్తాలు

జంగారెడ్డిగూడెం, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే ఆరు క్వింటాళ్ల ఎండీఎం బియ్యం పాడైపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం బియ్యం 40 బస్తాలు వంటగదిలో నిల్వ చేశారు. ఆ గది పక్కనే లక్కవరం గ్రామానికి చెందిన ఓ దాత విద్యార్థులకు భోజనశాల కట్టిస్తున్నారు. ఆ కట్టడం బేస్మెంట్ వంట గది కంటే కాస్త ఎత్తుగా నిర్మించారు. ప్రతి రోజు భోజనశాల కట్టడాన్ని నీటితో క్యూరింగ్ చేస్తుండడం వల్ల వచ్చే నీరు, గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వచ్చే నీరంతా ఆ గదిలోకి చేరడంతో గదిలో ఉన్న 40 బస్తాలలో 12 బస్తాల బియ్యం తడిచి పోయి కుళ్ళి పోయాయి. పాఠశాల ఆవరణలో క్రికెట్ ఆడుతున్న యువకులు ఆ గదిలో నుంచి దుర్వాసన రావడంతో ప్రధానోపాధ్యాయురాలికి ఫోన్ చేశారు. ఆమె అక్కడికి చేరుకుని గది తాళాలు తీయగానే ఆ దుర్వాసన భరించలేనంతగా ఉందని స్థానికులు తెలిపారు. ఆ బియ్యం బస్తాలలో 12 బస్తాలు కుళ్ళిపోగా మిగతా 28 బస్తాలు బాగానే ఉన్నాయి. ఈ ఘటనపై ఎంఈఓ-2 జి.రాములు విచారణ చేపట్టారు. రిటైర్డ్ హెచ్‌ఎం, పాఠశాల కమిటీ ఛైర్మన్, సభ్యులు, రికార్డు అసిస్టెంట్ తదితరులను విచారించారు. విచారణ నివేదిక జిల్లా విద్యాశాఖాధికారికి అందజేస్తామన్నారు.

ప్రతి అర కిలో మీటరుకు పబ్లిక్ టాయిలెట్ నిర్మించాలి

జంగారెడ్డిగూడెం,మే 23 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో పన్నులు వసూలు చేయడంలో వేగం పెంచాలని మునిసిపల్ శాఖ ఆర్డీ సీహెచ్. నాగ నరసింహారావు సూచించారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో జిల్లాలో మున్సిపల్ కమిషనర్‌లు, కార్యాలయ సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలలో వివిధ రూపాలలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయ వనరులను నిర్లక్ష్యం చేసిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ఏజీ ఆడిట్ సక్ర మంగా చేయని వారికి నోటీసులు జారీ చేస్తా మన్నారు. పురమిత్ర యాప్‌ను ప్రజలతో డౌన్‌లోడ్ చేయించాలని ఆ యాప్ ద్వారా ప్రజలే తమ ఫిర్యాదును అప్‌లోడ్ చేయవచ్చన్నారు. ప్రభుత్వ నిబంధనలను మీరి అక్రమంగా కట్టడాలు నిర్మించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పట్టణాలలో ప్రతి అరకిలో మీటరుకు ఒక పబ్లిక్ టాయిలెట్ నిర్మించాలన్నారు.

అవగాహన లేని పాలనతో నష్టం

ఎమ్మెల్యే చింతమనేని


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న రేషన్ డీలర్లు

పెదవేగి, మే 23 (ఆంధ్రజ్యోతి) : అవగాహన లేని పాలకులతో అంతానష్టమేనని, ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనతో రాష్ట్రాభివృద్ధి పదేళ్లు వెనక్కి పోయిందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఐదేళ్లలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన జగన్‌రెడ్డి పాలనలో లోపాలను సరిచేసుకుంటూ కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన దిశగా ముందడుగు వేస్తోందని ఆయన చెప్పారు. రేషన్ పంపిణీ వ్యవస్థను మార్పు చేసి, పాత విధానంలోనే రేషన్ పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన నేపథ్యంలో దెందులూరులోని రేషన్ డీలర్లు శుక్రవారం పెదవేగి మండలం దుగ్గిరాలలో ఎమ్మెల్యే ప్రభాకర్‌ను కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ పాలన సక్రమంగా ఉంటేనే అభివృద్ధి అనేది సాధ్యమవుతుందన్నారు.

బంగారం షాపులపై విజిలెన్సు తనిఖీలు

ఏలూరు క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలోని బంగారు షాపుల్లో జీఎస్టీ చెల్లించకుండా బంగారాన్ని విక్రయాలు చేస్తున్నారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విజిలెన్స్ ఎస్పీ వి శ్రీరాంబాబుకు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు విజిలెన్సు సీఐ వి శివరామకృష్ణ, ఎస్ఐ కె.సీతారామ్, తహసీల్దార్ బి.కన్యాకుమారి, తూనికలు కొలతలు శాఖ ఏసీ వీఎన్‌విఎస్ శ్రీ ఈశ్వరామ్, జీఎస్టీ అధికారి వినోదరావు ప్రత్యేక బృందంగా ఏర్పడి శుక్రవారం ఏలూరు నగరంలోని శుభం జ్యూవెలరీ, సరస్వతి సిల్వర్ ప్యాలెస్ షాపులలో తనిఖీలు నిర్వహించారు. సుభం జ్యూవెలరీలో అన్ని ఖచ్చితంగా ఉండడాన్ని గుర్తించారు. సరస్వతి సిల్వర్ ప్యాలెస్‌లలో 160 గ్రాముల బంగారు, 5400 గ్రాముల వెండి స్టాక్ రిజిస్టర్ కన్నా ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి జీఎస్టీ అధికారులు లక్షా 15 వేల 468 రూపాయలు అపరాధరుసుము విధించారు. సరస్వతి సిల్వర్ ప్యాలెస్‌లో ఎటువంటి ధృవీకరణ లేనటువంటి రెండు ఎలక్ట్రానిక్ కాటాలు గుర్తించి కేసు నమోదు చేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం: కాపాడిన శక్తి టీమ్

ఏలూరు క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో రైలు క్రింద పడి ఆత్మహత్య చేసుకోవడానికి శుక్రవారం ఒక మహిళ ఏలూరు ఎన్ఆర్‌పేట వద్ద రైలు పట్టాల వద్దకు చేరుకుంది. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన మహిళకు వివాహమైంది. ఈ క్రమంలో కుటుంబంలో కొద్దిరోజులుగా కలహాలు నెలకొన్నాయి. దీంతో ఆమె శుక్రవారం సాయంత్రం ఆమె ఏలూరు ఎన్ఆర్‌పేట సమీపంలోని రైలు పట్టాల వద్ద ఆత్మహత్యకు పాల్పడేందుకు వెళ్లింది. ఆమె కుటుంబ సభ్యులు 112కు సమాచారం ఇవ్వడంతో క్షణాల్లో శక్తి టీం ఆమె వద్దకు చేరుకుని ఇంటికి చేర్చారు.

జోన్ చైర్మన్ దృష్టికి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు

ఏలూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడుని తాడేపల్లిగూడెం డిపో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు చోడగిరి వెంకటరమణ శుక్రవారం ఏలూరులోని ఛైర్మన్ నివాసంలో కలిశారు. తాడేపల్లిగూడెం డిపోలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను జోనల్ ఛైర్మన్‌కి వివరించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని జోనల్ ఛైర్మన్ హామీ ఇచ్చారని వెంకటరమణ తెలిపారు.

జనసేనలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న జనసేన నాయకులు కొఠారు ఆదిశేషు, లక్ష్మీ దంపతులు

దెందులూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : పోతునూరు గ్రామ పంచాయతీ పరిధిలో 35 కుటుంబాలు వైసీపీని వదిలి జనసేన పార్టీలోకి చేరారు. శుక్రవారం పోతునూరు గ్రామంలో జనసేన దెందులూరు నియోజకవర్గ ముఖ్యనాయకులు కొఠారు ఆదిశేషు, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో పండూరి దుర్గాప్రసాద్, దాకారపు సత్యనారాయణ, సందక అప్పారావులతో పాటు 35 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు.

మాలదాసు కార్యవర్గం ఎంపిక

టి.నర్సాపురం, మే23 (ఆంధ్రజ్యోతి): తిరుమలదేవిపేట గ్రామ పంచాయతీ వెంకటాపురం గ్రామంలో జరిగిన మాలదాసు ఆత్మీయ సమావేశంలో నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. అధ్యక్షులు గజ్జెల పుణ్యేశ్వరరావు, ఉపాధ్యక్షులు టి.శ్రీను, కార్యదర్శి జట్టి అరుణ్‌కుమార్, కోశాధికారి మూగ రాజు శేషారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

టీ.నర్సాపురం, మే23 (ఆంధ్రజ్యోతి): తెడ్లం గ్రామంలో విద్యుదాఘాతానికి పాడిగేదె మృతి చెందింది. గ్రామంలో ప్రభాకర్‌రెడ్డి రైస్‌మిల్లు వద్ద విద్యుత్ వైరు తగిలి గేదె మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గేదె విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గతంలో కూడా రెండు గేదెలు మృతి చెందినట్లు తెలిపారు.

కళ్లల్లో కారం కొట్టి గొలుసు చోరీ

జంగారెడ్డిగూడెం,మే 23 (ఆంధ్రజ్యోతి): తాపీ పని చేయడానికి వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఇంటి యజమానురాలి కళ్ళల్లో కారం కొట్టి ఆమె మెడలో ఉన్న నాలుగు కాసుల బంగారు మంగళ సూత్రాల తాడు తెంచుకుపోయిన ఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కుందా శ్రీ రామశాస్త్రి-జానకీదేవి భార్యాభర్తలు. వీరిద్దరూ టీచర్స్‌గా పనిచేసి రిటైర్ అయ్యి ఇంటివద్దనే ఉంటున్నారు. స్థానిక అయ్యన్నకాలనీలో తమ ఇంటిని బాగు చేయించుకుందామని తాపీ పనివారిని మాట్లాడుకున్నారు. శుక్రవారం ఇంటి వద్ద గోడకు ముగ్గురు వ్యక్తులు ప్లాస్టింగ్ చేస్తున్నారు. ఇంటి యజమాని శ్రీ రామశాస్త్రి టిఫిన్ తీసుకురావడానికి బయటకు వెళ్లారు. ఇదే అదనుగా చూసుకుని తాపీ పని చేస్తున్న చింతపల్లి అంజిబాబు, నక్కా శ్రీను అలియాస్ పండు, యడ్లపల్లి విజయరాజు కలిసి ఇంటి యజమాని భార్య జానకీదేవి కళ్ళలో కారం కొట్టి ఆమె మెడలో ఉన్న నాలుగు కాసుల మంగళ సూత్రాల తాడు తెంచుకుని పారిపోయారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అంటువ్యాధులపై అవగాహన

ఏలూరు అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ సూచించారు. శుక్రవారం లంబాడీపేట అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని వీధుల్లో స్థానికులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు హానిచేసే డెంగీ, మలేరియా దోమలు ఇంటిపరిసరాల్లో, నీరునిల్వ ప్రాంతాల్లో, ఎయిర్ కూలర్లు, నీళ్లతొట్టెలు, స్విమ్మింగ్‌పూల్స్‌లో వృద్ధి చెందుతాయన్నారు. ఆసుపత్రి వైద్యాధికారి ట్వింకిల్ మాట్లాడుతూ రోడ్డుపక్కన విక్రయించే ఆహారపదార్థాలు, శీతలపానీయాలకు దూరంగా ఉండటంవల్ల రోగాలబారిన పడకుండా కాపా డుకోవచ్చునన్నారు. అసిస్టెంట్ మలేరియా అధి కారి గోవిందరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



గరుడ వాహనంపై గ్రామోత్సవం

జంగారెడ్డిగూడెం,మే 23 (ఆంధ్రజ్యోతి): గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం గరుడ వాహనంలో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి పట్టణంలోని ప్రధాన రహదారులలో స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని ఈవో రాంబాబు తెలిపారు.

యానాదులకు కులధ్రువీకరణ పత్రాలు

పెదపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం నాయుడుగూడెం గ్రామంలో నివసిస్తున్న ఎస్టీ యానాదుల కమ్యూనిటీకి చెందినవారు సుమారు 30 సంవత్సరాల నుంచి నివాసముంటున్నారని, వారికి కులధ్రువీకరణ పత్రాలను అధికారుల సహకారంతో అందజేయడం జరిగిందని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) కో-ఆర్డినేటర్ గోసాల ఝాన్సీరాణి తెలిపారు. వీరి ఇబ్బందులను గుర్తించి కులధ్రువీకరణ పత్రాలు అందజేయాలని అధికారులకు అర్జీలు సమర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణజ్యోతి, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

నడిపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

పెదవేగి, మే 23 (ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం నడిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నడిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన రూ.30లక్షల మేర నిధులు దుర్వినియోగమైనట్టు గ్రామస్థులు పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో జరిగిన విచారణలో రూ.11.80లక్షల మేర నిధులు దుర్వినియోగమైనట్లు తేలింది. ఈ నిధులను సర్పంచ్‌తోపాటు ఇరువురు కార్యదర్శులు తిరిగి పంచాయతీకి జమచేయాలని ఆదేశించారు. అయితే ఇప్పటికీ ఆ సొమ్ము పంచాయతీలో జమచేయలేదు. కాగా నిధుల దుర్వినియోగానికి పాల్పడిన గ్రామ సర్పంచ్ మేకా అప్పాయమ్మ చెక్ పవర్ రద్దుకు కలెక్టర్ వెట్రిసెల్వీ ఇచ్చిన ఆదేశాలమేరకు డీపీవో చెక్‌పవర్ రద్దు ఉత్తర్వులు జారీచేశారు. దీంతో పాటు ఆ సమయంలో విధులు నిర్వహించిన ఇరువురు కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారని చెప్పారు.

రామన్నపాలెంలో ఎమ్మెల్యే పల్లె నిద్ర

కామవరపుకోట, మే 23 (ఆంధ్రజ్యోతి) : రామన్నపాలెం గ్రామ పంచాయతీలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శుక్రవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మారుతీనగర్‌లోని మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ నివాసం వద్ద కొద్దిసేపు ఆ ప్రాంత ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు, ఉద్యోగులకు ఆదేశాలు ఇచ్చారు. అదేవిధంగా మద్దిపోటువారిగూడెంలో మాజీ ఎంపీపీ మద్దిపోటి సుబ్బలక్ష్మి నాగేశ్వర రాంబాబు నివాస గృహం వద్ద అక్కడి గ్రామ ప్రజలతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు.

మహిళల రక్షణకు చట్టాలు

ఏలూరు క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి) : బాలికలు, మహిళలకు ఎన్నో రక్షణ చట్టాలు ఉన్నాయని వాటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు అన్నారు. మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఏలూరు సత్రంపాడులోని ఇండస్ట్రియల్ పార్కులో శుక్రవారం నిర్వహించారు.





ఏలూరులో ప్రార్థనలు చేస్తున్న సీహెచ్‌వోలు.. మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా.. ఆర్టీసీ డిపో వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు..బుట్టాయగూడెంలో దీక్షలకు ఎమ్మెల్సీ గోపిమూర్తి మద్దతు

సమస్యల పరిష్కారానికి ఆందోళన బాట

సీహెచ్‌వోల వినూత్న నిరసన

ఏలూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : సీహెచ్‌వోలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏపీ సీఎంఎ ఆధ్వర్యాన చేస్తున్న నిరవధిక సమ్మె 26వ రోజుకు చేరింది. దీనిలో భాగంగా ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద ధర్నా కొనసాగించారు. శుక్రవారం మోకాళ్ళపై నిలబడి తమ ఇష్టదైవాలను ప్రార్థిస్తూ ప్రభుత్వం మనసు మార్చాలని కోరుతూ ప్రార్థించి వినూత్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సిద్దయ్య మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలోని ఎంహెచ్‌ఎం కింద సీహెచ్‌వోలుగా పనిచేస్తున్నా గత రెండేళ్ళుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. ఆరేళ్ళ దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని, ఎంహెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతి నెలా జీతంతో పాటు ఇంటెన్సివ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఐదవ రోజుకు మునిసిపల్ కార్మికుల ధర్నా

ఏలూరు టూటౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని ఇంజనీరింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు సాంబశివరావు అన్నారు. కార్మికులు చేస్తున్న నిరసన కార్యక్రమాలు 5వ రోజుకు చేరాయి. శుక్రవారం మునిసిపల్ కార్యాలయం ఎదురుగా టెంట్ వేసి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ టెక్నికల్, నాన్‌టెక్నికల్ కార్మికులకు జీతం రూ.29200 ఇవ్వాలన్నారు. 15సంవత్సరాలు సర్వీసు ఉన్న కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు.

నేషనల్ మజ్దూర్ యూనిటి గేట్ మీటింగ్

ఏలూరు క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మజ్దూర్ యూనిటి రాష్ట్ర కమిటి పిలుపుమేరకు ఏలూరు ఆర్టీసీ డిపో వద్ద ఆ సంఘ నాయకులు, కార్మికులు శుక్రవారం ఉదయం గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొద్ది సేపు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జోనల్ నాయకులు ఎస్ ప్రసాదరావులు పాల్గొని మాట్లాడారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ 1/2019 సర్క్యులర్ సాధించిన దానిపై వివరణ, మిగిలిన అంశాలపై గేట్ మీటింగ్ ద్వారా వివరించారు.

ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలి

బుట్టాయగూడెం, మే 23 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి డిమాండ్ చేశారు. బుట్టాయగూడెం మండల కేంద్రంలో గిరిజనులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 9వ రోజుకు చేరగా ఎమ్మెల్సీ గోపిమూర్తి మద్దతు తెలిపి దీక్షల్లో పాల్గొని మాట్లాడారు. స్థానిక అభ్యర్థులతోనే విద్యార్థులకు బోధన సమర్థవంతంగా జరుగుతుందని, ఏజెన్సీ ప్రాంత గిరిజన నిరుద్యోగులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని అన్నారు. జీవో నెం3 రద్దు వలన గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని, నష్టాన్ని భర్తీ చేయడానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ జీవోలు, చట్టాలు చేయాలని శాసనమండలిలో ప్రస్తావించినట్లు తెలిపారు. దీక్షలను ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు జలగం రాంబాబు ప్రారంభించారు.

భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి

కలిదిండి, మే 23 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలంటే భూసార పరీక్షలను రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భూసార పరీక్షలలో ఎరువులను తగు మోతాదులో వేయడం వల్ల పెట్టుబడి వ్యయం తగ్గుతుందన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగిస్తే భూసారం పెరిగి పంట దిగుబడులు అధికంగా వస్తాయన్నారు. వర్షాలు కురుస్తుండడంతో రైతులు మెట్ట దుక్కులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం

ముదినేపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ముదినేపల్లిలో సువర్చలా సమేత భక్తాంజనేయస్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అలంకరించిన రథంపై స్వామివార్లను ముదినేపల్లిలోని పురవీధుల్లో ఊరేగించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చీదెళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు, వాసవీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి వత్తుమిల్లి ప్రసాద్, సంఘ నాయకులు కొల్లిపర రఘురామన్, కృష్ణ ప్రసాద్, జల్లూరి త్రివిక్రమ్, ఎస్ఐ వీరభద్రరావు తదితరులు రథోత్సవ పూజలు నిర్వహించారు.


వేషధారణలో కళాకారులు


ఆంజనేయస్వామి రథాన్ని లాగుతున్న ఎస్ఐ వీరభద్రరావు, భక్తులు

గ్రామ సచివాలయాల క్లస్టర్ల ఏర్పాటు

ముదినేపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయాల స్వరూపం మారనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మండలంలోని 21 సచివాలయాలను 11 క్లస్టర్లుగా ఏర్పాటు చేశారు. మండలంలోని ముదినేపల్లి-1, 2 సచివాలయాలను ఒక క్లస్టర్‌గా, పెదపాలపర్రు, కోడూరు సచివాలయాలను రెండవ క్లస్టర్‌గా, గురజ, పెనుమల్లి సచివాలయాలను మూడవ క్లస్టర్‌గా, వడాలి, చిగురుకోట సచివాలయాలను నాల్గవ క్లస్టర్‌గా బొమ్మినంపాడు, అల్లూరు సచివాలయాలను 5వ క్లస్టర్‌గా, సింగరాయపాలెం, శ్రీహరిపురం సచివాలయాలను ఆరవ క్లస్టర్‌గా, పెదగొన్నూరు, కొరగుంటపాలెం సచివాలయాలను ఏడవ క్లస్టర్‌గా, దేవపూడి, ఊటుకూరు సచివాలయాలను 8వ క్లస్టర్‌గా, వణుదుర్రు, వాడవల్లి సచివాలయాలను 9వ క్లస్టర్‌గా, వైవాకను 10వ క్లస్టర్‌గా, పెయ్యేరు, పేరూరు సచివాలయాలను 11వ క్లస్టర్‌గా మండల పరిషత్ అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సుమారు 140 మంది సచివాలయాల ఉద్యోగులను ఈ క్లస్టర్లలో వివిధ హోదాల్లో సర్దుబాటు చేస్తారని అధికారులు తెలిపారు.

స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు

కలిదిండి, మే 23 (ఆంధ్రజ్యోతి): గోతులు పడి అధ్వానంగా ఉన్న పెదలంక - మూల్లంక ప్రధాన రహదారికి కూటమి నాయకులు శుక్రవారం స్వచ్ఛందంగా ప్రారంభించారు. రహదారిపై గోతుల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించి ఎక్స్‌కవేటర్‌తో చదును చేయించారు. మూల్లంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పెదలంక వరకు ఆరు కిలోమీటర్ల మేర రహదారిపై గోతుల్లో నిలిచిన నీరును యుద్ధ ప్రాతిపదికన తొలగించి బస్సులు, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా గోతులను చదును చేయడంతో లంక గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డీసీ ఛైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, ఎత్తిపోతల కమిటీ ఛైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు, నాయకులు బండి తులసీరావు, తంగెళ్ల గణపతి, దున్న భోగేశ్వరరావు పాల్గొన్నారు.


పెదలంక - మూల్లంక రహదారిపై గోతుల్లో నీరును ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

» ముడా ఛైర్మన్ మట్టా ప్రసాద్

కైకలూరు,మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మంచినీటి వసతి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని మచిలీపట్నం అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ (ముడా) ఛైర్మన్ మట్టా ప్రసాద్ అన్నారు. శుక్రవారం కైకలూరు మండలం కొల్లేటికోట పెద్దింటి అమ్మవారికి ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలిదిండి మండలం గుర్వాయిపాలెం మంచినీటి చెరువు పూడికతీత పనులకు రూ.20 లక్షల నిధులను మంజూరు చేశామని, వరహాపట్నం గ్రామంలో మంచినీటి చెరువులో పూడిక తీతకు మరో రూ.10 లక్షల నిధులకు ప్రతిపాదనలు చేశామని అన్నారు. కొల్లేటికోట ఆలయం చుట్టూ అభివృద్ధి పనులకు సహకరిస్తామని ప్రభుత్వం మరింత నిధులను సమకూర్చి అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, దూర ప్రాంతాల నుంచి భక్తులు నిత్యం అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తునందున భక్తులకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, కృష్ణాజిల్లా బీజేపీ అధ్యక్షుడు కుమార్, ఎంపీపీ అడవి కృష్ణ, టీడీపీ నాయకులు బీకెఎం నాని, బలే ఏసురాజు, పూల రామచంద్రరావు, జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ముడా ఛైర్మన్ మట్టా ప్రసాద్, ఎమ్మెల్యే కామినేని తదితరులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కోసం ఈనెల 24న కైకలూరు మండలం పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలగనున్నట్టు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులందరూ గమనించి సహకరించాలని కోరారు.


టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడిని కలసిన శ్రీహరిపురం సర్పంచ్ విశ్వేశ్వరరావు

యనమలను కలసిన విశ్వేశ్వరరావు

ముదినేపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడును ముదినేపల్లి మండలం శ్రీహరిపురం సర్పంచ్, పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి పరసా విశ్వేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో యనమలను కలసి పలు విషయాలపై చర్చించారు. బీసీ సబ్‌ప్లాన్‌ను అమలు చేసేందుకు కృషి చేయాలని, తద్వారా బీసీ సామాజిక వర్గానికి చెందిన పేదలు ప్రయోజనం పొందే అవకాశం ఉంటుందని విశ్వేశ్వరరావు కోరారు.

బైక్ పైనుంచి పడిన వృద్ధురాలి మృతి

కైకలూరు,మే 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళుతున్న వృద్ధురాలు కళ్ళు తిరిగి బైక్ నుంచి జారి పడి మృతి చెందిన ఘటనపై కైకలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈనెల 8న వరహాపట్నం గ్రామానికి చెందిన బోయిన రంగమ్మ (60) ఆమె కుమారుడు శ్రీనివాస్‌తో కలిసి రాత్రి సమయంలో మెడికల్ దుకాణానికి వెళ్లింది. ఇంటికి తిరిగి వస్తుండగా గ్రామంలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయం వద్దకు వెళ్లే సరికి బైక్ నుంచి కళ్లు తిరిగి పడడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రంగమ్మ మృతి చెందిందన్నారు. ఆమె కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

యోగాతో ఒత్తిడి దూరం

కైకలూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): యోగాసనాలతో ఒత్తిడిని తగ్గించుకుని ఆరోగ్యవంతంగా ఉండవచ్చని ఎండీవో ఫణీంద్ర అన్నారు. శుక్రవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయం సిబ్బందికి, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వైద్యఆరోగ్య శాఖ సిబ్బందికి వచ్చే 21వ తేదీ వరకు చేపట్టే యోగాసనాల కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి రోజూ మండల పరిషత్ కార్యాలయంలో యోగా కార్యక్రమాలను నిర్వహించాలని, ప్రజల్లో యోగా పట్ల ఆసక్తి పెంపొందించేలా చూడాలన్నారు.

ముదినేపల్లి : మండలంలోని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పెదగొన్నూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి యోగా ట్రైనర్ ఎన్.గౌరి వజ్రాసనంపై శిక్షణ ఇచ్చారు. నెల రోజులు ఈ యోగాసనాల కార్యక్రమాలు నిర్వహిస్తారని ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లలో వసతులు కరువు

» స్థలాలు ఉన్నా భవన నిర్మాణాలు లేవు
» అద్దె భవనాల్లో నడుపుతున్న వసతి గృహాలు

కైకలూరు : ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో వసతులు కరువయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో భవనాలకు రంగులు వేయకపోవడంతో పాడుపడిన భవనాల్లా కనిపిస్తున్నాయి. కైకలూరు నియోజకవర్గంలో బీసీ సంక్షేమ హాస్టళ్ళ దుస్థితి అధ్వానంగా ఉన్నది. ప్రభుత్వ భవనాలు ఉన్నప్పటికీ అవి శిథిలమైపోవడంతో అద్దె భవనాలు, ఇరుకు గదులలో ఎలాంటి వసతి లేని చోట హాస్టల్‌లను నడుపుతున్నారు. కైకలూరు సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం భవనం పూర్తిగా ధ్వంసం కావడంతో మూడు కోట్లతో నూతన భవన నిర్మాణా నికి ప్రతిపాదనలు చేశారు. ప్రస్తు తం ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ హాస్టల్‌ను రూ. 15 లక్షలతో తాత్కాలికంగా రేకుల హెడ్డు నిర్మాణానికి చేపట్టారు. ముదినేపల్లిలో ఎస్సీ కళాశాలల బాలిక భవనం శిథిలమవడంతో ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్నారు. మూడు కోట్లు ప్రతిపాదనలు చేసినప్పటికీ మంజూరు కాలేదు. దీంతో రూ. 10 లక్షల వ్యయంతో తాత్కలిక షెడ్‌ల నిర్మాణం చేపట్టారు. మండవల్లి ఎస్సీ హాస్టల్‌లో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కలిదిండి ఎస్సీ బాలుర వసతి గృహంలో ప్రహరీ లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి. బీసీ బాలిక హాస్టల్ భవనం శిథిలమవడంతో కొద్దిపాటి వర్షానికి శ్లాబు నుంచి నీరు గదులోకి కారుతున్నాయి.

ఆంధ్రజ్యోతి విజిట్


కైకలూరులో ఎస్సీ బాలికల వసతి గృహంలో తాత్కాలిక షెడ్ నిర్మాణం చేస్తున్న దృశ్యం

నూజివీడులో తిరంగా ర్యాలీ



నూజివీడు టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా నూజివీడులో శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు జరిగిన ర్యాలీలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు, వ్యాపార, వాణిజ్య, విద్యా, సామాజిక సంస్థలు, ఆర్ఎస్ఎస్‌కు చెందిన ప్రతినిధులు మహిళలు పాల్గొన్నారు. ముందుగా భారతమాత చిత్రపటానికి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించారు. ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొని అసువులు బాసిన మురళీనాయక్‌కు నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్, పార్టీ నాయకులు మాటూరి రవికాంత్, నూజివీడు, చాట్రాయి మండల అధ్యక్షులు మల్లెపూడి నాగరాణి, ఓబిళ్లనేని రాజా, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి, సత్యనారాయణ, బోను అప్పారావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం

నూజివీడు, మే 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితులకు మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో రూ.1.2 లక్షల సహాయాన్ని అందించారు. పట్టణంలో పోతురెడ్డిపల్లి అడ్డరోడ్డు వద్ద లారీ పల్టీ కొట్టిన సంఘటనలో పక్కనే ఉన్న ఆటో, సోడా బడి ధ్వంసమయ్యాయి. మంత్రి సారథి చొరవతో లారీ యజమానితో మాట్లాడి పోతురెడ్డిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ భాస్కర్‌కు శుక్రవారం ఆర్థిక సహాయాన్ని అందించారు.

జిల్లా మహానాడుకు హాజరుకాని ముద్దరబోయిన

నూజివీడు, మే 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నూజివీడులో జరిగిన ఏలూరు జిల్లా మినీ మహానాడు వేదికపై కనిపించలేదు. నూజివీడులోనే కార్యాలయం నడుపుతున్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మినీ మహానాడుకు రాకపోవడం కార్యకర్తల్లో చర్చనీయాంశమైంది. జిల్లా పార్టీ నుంచి ఆహ్వానం అందకపోవడం వల్లే ఆయన ఆయన పాల్గొనలేదని సమాచారం.

గాయపడిన మహిళ మృతి

ముసునూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యనారాయణస్వామి దర్శనానికి వెళుతుండగా గురువారం తెల్లవారుజమున జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ శుక్రవారం ఉదయం మృతి చెందింది. ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన భూబత్తుల రఘుబాబు, భార్య భూబత్తుల లక్ష్మీదుర్గ, పిల్లలు, బంధువులు కలిసి టాటాఏస్ వాహనంలో బుధవారం సాయంత్రం అన్నవరం బయలుదేరారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం వద్ద బైపాస్ రహదారిలో గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. భూబత్తుల లక్ష్మీదుర్గ(29) తీవ్రంగా గాయపడింది. ఆమెను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

ఆగిరిపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న చొప్పరమెట్ల గ్రామానికి చెందిన పి.పద్మకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.60 వేలు మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం అందజేశారు. బాధిత కుటుంబం ఆర్థిక పరిస్థితి బాగోలేదని మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి సీఎం సహాయనిధి నుంచి రూ.60వేలు మంజూరు చేయించారు.

జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడిగా యండూరు

ఆగిరిపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆగిరిపల్లికి చెందిన యండూరు నరసింహమూర్తిని నియమిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ యోగ అసోసియేషన్ సెక్రటరీ అల్లాడి రవికుమార్ తెలిపారు. ప్రధాన కార్యదర్శి బొద్దూరు సాంబశివరావు (ఆగిరిపల్లి), వైస్ ప్రెసిడెంట్ నున్న కాశీ ప్రసాద్ (కలిదిండి), కోశాధికారిగా అద్దంకి పోతులూరి వీరబ్రహ్మాచారి (ఆగిరిపల్లి), జాయింట్ సెక్రటరీ గూడవల్లి నాగమురళి (నూజివీడు), కార్యవర్గ సభ్యులు జూలూరు వేణుగోపాల్, తిరువీధుల విజయభాస్కర్, పేరూరి వెంకట రాజేష్, జ్యోతికుమారిలను నియమించారని తెలిపారు.

రైతుల కోసమే ప్రభుత్వం

» ఏలూరులో కోకో రైతుల సమావేశం
» సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి
» కొనుగోళ్లకు కంపెనీల అంగీకారం
» మంత్రి అచ్చెన్నాయుడు

రైతులకు ఏ ఇబ్బంది వచ్చినా తక్షణం పరిష్కరిస్తున్నాం. వారి బాగోగులపై శ్రద్ధ పెట్టాం. ఏ పంట పండించినా సరే రైతు ఇబ్బంది పడకుండా అధికారులను రంగంలోకి దింపుతున్నాం. ప్రభుత్వమే నేరుగా కదిలి వచ్చి పరిష్కారం చూపుతుంది. కోకో రైతుల కష్టాలను తీరుస్తాం. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని వ్యవసాయ శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు.



ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన కోకో రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, వేదికపై మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యేలు బడేటి చంటి, కామినేని శ్రీనివాస్, కలెక్టర్ వెట్రిసెల్వి, తదితరులు

ఏలూరు, మే 23(ఆంధ్రజ్యోతి): రైతు పండించిన పంటకు మద్దతు ధర కల్పించడమే కాకుండా వారి బాగోగులపై తక్షణం స్పందిస్తున్నామని వ్యవసాయ శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. కోకో రైతుల సమస్యలపై శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కోకో కొనుగోలుపై ఒక నిర్ణయం తీసుకున్నామని, మధ్యస్థ ధర ఉండేలా కంపెనీలతో మాట్లాడినట్లు తెలిపారు. కంపెనీలు రూ.450 ధరకే కొనుగోలు చేస్తామని చెప్పినప్పటికి మరో రూ.50 ప్రభుత్వం భరించి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. రైతుల వద్ద ఉన్న కోకో గింజలను రూ.500 ధరకు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో ఆధారిత ఉత్పత్తులు తగ్గడంతో కొంత సమస్య ఏర్పడిందన్నారు. భవిష్యత్తులో కోకోకు కూడా ఒక చట్టం తెచ్చే యోచనలో ఉందన్నారు. కోకో పంట నాణ్యతపై రైతులకు శిక్షణ ఇచ్చే ప్రయత్నాలు చేస్తామన్నారు.

కోకో పంటకు ధర ఇవ్వడంలో ట్రేడర్లు కంపెనీలు విఫలమవుతున్నాయని మంత్రి పార్థసారథి అన్నారు. దళారి వ్యవస్థ లేకుండా కంపెనీలకు నేరుగా రైతులు కోకో గింజలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోకో పంటకు గత ఏడాది, ప్రస్తుత ధరకు చాలా వ్యత్యాసం ఉండటంతో ధర నిర్ణయంపై కంపెనీలు నిర్ధిష్ట విధానం అవలంబించాలన్నారు.

కోకో రైతుల సమస్యలు తెలిసిన వెంటనే స్పందించాం. రైతులు, ట్రేడర్‌లు, కంపెనీలతో ప్రత్యేకంగా సమావేశం కావడం శుభపరిణామమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సమస్య పరిష్కరించేందుకు కృషి చేసిన మంత్రులకు ధన్యవాదాలు

గత ఏడాది కోకో కిలో రూ.900 పైగా ధర పలికిందని, ప్రస్తుతం రూ.300-రూ.400 ఉందని రైతు వెంకటేశ్వరరావు అన్నారు. కొనుగోలులో కంపెనీలు రైతులకు ఎన్నో షరతులు పెడుతున్నాయి. తేమ శాతం, పంగస్ పేరుతో తక్కువ ధరకు కొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, ఉద్యాన వనశాఖ డైరెక్టర్ శ్రీనివాస్, కలెక్టర్ వెట్రి సెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాషా, రైతు సంఘం నాయకులు శ్రీనివాస్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కోకో ధర తగ్గడంలో కంపెనీల కుట్ర : రైతుల నిరసన


మోకాళ్లపై కూర్చుని కోకో రైతుల నిరసన

ఏలూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): కోకో గింజల ధరపై ప్రభుత్వం నిర్వహించిన ద్వైపాక్షిక చర్చలు విఫలమైనట్లు ఏపీ కోకో రైతుల సంఘం నాయకులు ప్రకటించారు. కోకో గింజలను అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకుండా బహుళజాతి కంపెనీల మోసాలకు నిరసనగా కలెక్టరేట్ శుక్రవారం కోకో రైతులు ధర్నా నిర్వహించారు. కోకో రైతులకు న్యాయం చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వాలని, కార్పొరేట్ కంపెనీల మోసాలను అరికట్టాలని నినాదాలు చేశారు. కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 3 నెలలుగా కోకో రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నారని, గత వారం రోజులుగా పోరాటాన్ని ఉధృతం చేశామన్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల సమక్షంలో చర్చలకు మోండలీజ్ కంపెనీ ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడడాన్ని ఖండించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలు రూ.880 ఉంటే మోండలీజ్ కంపెనీ రూ.450కు మించి ధర ఇవ్వలేమని చెప్పడం దుర్మార్గం అన్నారు. ఇది బహుళజాతి కంపెనీల కుట్రలో భాగమని విమర్శించారు. రాష్ట్ర మంత్రులు ప్రకటించిన నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. రైతు సంఘం నేతలు కె.శ్రీనివాస్, వై.కేశవరావు, మాగంటి హరిబాబు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలను బుజ్జగించేవిధంగా చర్చలు సాగడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.గోపాలకృష్ణ, బొల్ల రామకృష్ణ, బోళ్ళ వెంకట సుబ్బారావు, ఉప్పుగంటి భాస్కరరావు, పానుగంటి అచ్యుతరామయ్య, గుదిబండి వీరారెడ్డి, ఉప్పల కాశీ, కొప్పిశెట్టి ఆనంద వెంకట ప్రసాద్, కోనేరు సతీష్‌బాబు, చింతకాయల బాబురావు, ఇతర జిల్లాల రైతులు పాల్గొన్నారు.

ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు ఐదుగురి ఎంపిక

చాట్రాయి, మే 23(ఆంధ్రజ్యోతి): జనార్ధనవరం మెయిన్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు, చాట్రాయి మెయిన్ స్కూల్‌కు చెందిన ఒక విద్యార్థిని ఏపీ గురుకుల పాఠశాలలో సీట్లు సాధించినట్లు హెచ్‌ఎంలు ఎస్.నరసింహరావు, జి.రాము తెలిపారు. జనార్ధనవరం పాఠశాల విద్యార్థినులు బండారు తేజస్విని, దాస్యం రుత్విక, చీపు జాహ్నవి, పలగాని వినీతశ్రీ ముసునూరు గురుకుల పాఠశాలలోను, చాట్రాయి మెయిన్ పాఠశాల విద్యార్థిని లక్కనబోయన శ్రీవిద్య వాసిని నిమ్మకూరు ఏపీ గురుకుల పాఠశాలలో సీట్లు సాధించినట్లు చెప్పారు. గురుకుల పాఠశాలలకు ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు గ్రామ ప్రముఖులు అభినందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250
నెక్ కోడి గుడ్డు ధర	(100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



వేసవి సెలవుల్లో ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా జిల్లా మీదుగా 44 ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు నడుపుతున్నారు. 08581 విశాఖపట్టణం - ఎస్ఎంవీటి బెం గళూరుకు ప్రతి ఆదివారం జూన్ 1 నుంచి జూన్ 29 వరకూ నడుపుతున్నారు. 08582 ఎస్ఎంవిటి బెంగుళూరు - విశాఖపట్నానికి ప్రతి సోమవారం జూన్ 2 నుంచి జూన్ 30 వరకూ నడపనున్నారు. ఈ రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, జాలర్ పెట్టయ్, కుప్పం, బంగరపేట, కృష్ణరాజపురం స్టేషన్లలో ఆగుతుంది. రైల్ నెంబర్ 08547 విశాఖపట్టణం-తిరుపతి ప్రతి బుధవారం జూన్ 4 నుంచి జులై 30 వరకూ నడపనున్నారు. 08548 తిరుపతి - విశాఖ పట్టణానికి ప్రతి గురువారం జూన్ 5 నుంచి జులై 31 వరకూ నడపనున్నారు. దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, కైకలూరు, గుడివాడ, విజ యవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట స్టేషన్లలో ఆగుతాయి. రైల్ నెంబర్ 08579 విశాఖపట్టణం - చర్లపల్లి ప్రతి శుక్రవారం జూన్ 6 నుంచి జులై 25 వరకూ నడపనున్నారు. 08580 చర్లపల్లి - విశాఖపట్టణం ప్రతి శనివారం జూన్ 7 నుంచి జులై 26 వరకూ నడపనున్నారు. దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూ రు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్లల్లో టూటైర్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఉంటాయని అధికారులు తెలిపారు.

చత్తీస్‌గఢ్‌లో అక్రమ ఎన్‌కౌంటర్లు దారుణం

చాట్రాయి, మే 23(ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కగార్ పేరుతో అక్రమ ఎన్‌కౌంటర్‌ను సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్ ఖండించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, హోంమంత్రి అమీత్‌షా జీవించే హక్కును హరిస్తున్నారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌తో చర్చలు జరిపిన కేంద్రం, మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధం అంటుంటే అభ్యంతరం ఏమిటన్నారు. ఖనిజ సంపద లూటీ చేసే కార్పొరేట్ వర్గాలు చర్చలకు అడ్డుపడుతున్నారా? అని ప్రశ్నించారు. తక్షణం కగార్ రద్దు చేసి, అక్రమ ఎన్‌కౌంటర్లు ఆపాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలని హరనాథ్ డిమాండ్ చేశారు.